
ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY



ద్విచక్ర వాహనాన్ని ఢీకొట్టిన ఆర్టీసీ బస్సు

- అక్కడికక్కడే మహిళ మృతి
- మరో మహిళ పరిస్థితి విషమం

7



ఉపాధి హామీ ఇస్తున్నాం.. విస్తరాకుల్లోనే భోజనం చేస్తాం

పర్యావరణ పరిరక్షణ నిమిత్తం ప్లాస్టిక్ నియంత్రణలో మేము సైతం అంటూ ముందుకు వచ్చారు చేర్యాల మండలం చిట్యాల గ్రామ ఉపాధి హామీ కూలీలు. ఉపాధి పనులు చేస్తున్న కూలీలు భోజన సమయంలో విస్తరాకులు వినియోగించాలని నిర్ణయించుకుని సోమవారం వారంతా అందులోని భోజనాలు చేశారు. కూలీలు అప్పటికప్పుడు విస్తర్లను తయారు చేసుకుని తమ వెంట తెచ్చుకున్న భోజనాన్ని ఆరగించారు.

- చేర్యాల, జూన్ 10



జిల్లాలో పది రోజులపాటు కొనసాగిని ఎన్‌సీసీ క్యాంపు ముగిసింది. గజ్వేల్ పట్టణంలోని బాలుర విద్యా సౌధంలో సంగారెడ్డి బెటాలియన్ ఆధ్వర్యంలో 351 ఎన్‌సీసీ కేడెట్లకు వ్యక్తిత్వ వికాసం, యోగ, కవాతు, నాయకత్వ లక్షణాలు, ఆర్మీ, నేవీ, ఎయిర్‌ఫోర్స్ బలగాల పనితీరు, ట్రెక్కింగ్‌పై శిక్షణ ఇచ్చారు. నంగునూరు మండలం రాజగోపాలపేట పోలీస్‌స్టేషన్ పరిధిలో సోమవారం ఆయుధ శిక్షణ అందించారు. శిక్షణ కఠినంగా ఉన్నప్పటికీ ఇష్టంతో పాల్గొన్నామని, జీవితంలో ఉన్నతస్థాయికి ఎలా ఎదగాలనే ఆలోచన ఈ శిక్షణ ద్వారా తెలుస్తుందని పలువురు క్యాడెట్లు ఈ సందర్భంగా పేర్కొన్నారు.

- నంగునూరు, జూన్ 10



కేసీఆర్ ఇలాఖా.. కాంగ్రెస్, బీజేపీ తడాఖా

గజ్వేల్ - ప్రజ్ఞాపూర్ మున్సిపాలిటీలో పట్టు కోసం తహతహ

- లోక్‌సభ ఎన్నికలో పడిపోయిన బీఆర్ఎస్ గ్రాఫ్
- ఇదే అదనుగా పట్టణంలో పాగా వేసే ఛాన్స్
- ఆ రెండు పార్టీల వైపు నాయకుల చూపు
- కౌన్సిలర్ సీటు కోసం కారు దిగే అవకాశం

గజ్వేల్, జూన్ 10 : మాజీ సీఎం ఇలాఖాలో పాగా వేసేందుకు అటు కాంగ్రెస్ ఇటు బీజేపీ ప్రయత్నిస్తున్నాయి. లోక్‌సభ ఎన్నికల్లో ఆయా పార్టీలకు వచ్చిన ఓట్ల ఆధారంగా తమకూ గజ్వేల్ - ప్రజ్ఞాపూర్ మున్సిపాలిటీలో అవకాశం ఉందని భావిస్తున్నాయని తెలుస్తున్నది. మున్సిపాలిటీ పరిధిలో ఒకప్పుడు బీఆర్ఎస్ పార్టీ ఉనికిని చాటేందుకు శ్రమిస్తూ ఉండేది. బల్దియాలో బీఆర్ఎస్ పార్టీ తరఫున అన్ని వార్డుల్లో కనీసం పోటీకి అభ్యర్థులు కూడా దొరకని పరిస్థితి. కానీ, కేసీఆర్ గజ్వేల్ ఎమ్మెల్యేగా గెలిచి, ముఖ్యమంత్రి పదవి చేపట్టడంతో పట్టణంలో కారు దూసుకెళ్లింది. పోటీకి అభ్యర్థులు లేని స్థాయి నుంచి ఒక్కో వార్డుకు ముగ్గురు, నలుగురు ఆశావహులు కౌన్సిలర్ టికెట్ కోసం ఆ పార్టీ తలుపును తట్టారు. నాడు బీఆర్ఎస్ జోరులో కొట్టుకుపోతామని చాలామంది ఇతర పార్టీల నుంచి కూడా పోటీకి దిగేందుకు వెనుకాడారు. అదంతా గతం.. ప్రస్తుతం సీన్ రివర్స్ అయ్యేలా ఉంది. అసెంబ్లీ, పార్లమెంటు ఎన్నికల్లో బీఆర్ఎస్ గ్రాఫ్ పడిపోవడంతో ఆ పార్టీకి ఎదురీత తప్పేలా లేదు. సార్వత్రిక ఎన్నికలో కారుకు బ్రేకులు వేసి హస్తం, కమలం తడాఖా చూపించడంతో బల్దియాలో సమీకరణలు మారిపోయాయి. దీంతో కౌన్సిల్‌కు వెళ్లాలనుకునే వారి చూపు ఇప్పుడు కాంగ్రెస్, బీజేపీ పార్టీల వైపునకు మళ్లుతున్నది.

కాంగ్రెస్, బీజేపీకి ఆదరణ

డిసెంబరులో జరిగిన అసెంబ్లీ ఎన్నికలతో పోల్చితే తాజాగా పార్లమెంట్ ఎన్నికల్లో గజ్వేల్-ప్రజ్ఞాపూర్ మున్సిపాలిటీ పరిధిలో బీఆర్ఎస్ పార్టీకి ఓట్లు భారీగా తగ్గాయి. అసెంబ్లీ ఎన్నికల్లో ఈ మున్సిపాలిటీ పరిధిలో బీఆర్ఎస్‌కు 14,065 ఓట్లు రాగా, పార్లమెంట్ ఎన్నికల్లో 8,024 ఓట్లు వచ్చాయి. గతంతో పోల్చితే 6,041 ఓట్లు తగ్గాయి. ఇక బీజేపీకి గత అసెంబ్లీ ఎన్నికల్లో 7,403 ఓట్లు రాగా, పార్లమెంట్ ఎన్నికల్లో 8,456 వచ్చాయి. గతంతో పోల్చితే 1,053 ఓట్లు పెరిగాయి. కాంగ్రెస్ పార్టీ అనూహ్యంగా తమ ఓట్లను మూడు రెట్లు పెంచుకున్నది. అసెంబ్లీ ఎన్నికల్లో 2,069 ఓట్లు రాగా, పార్లమెంట్ ఎన్నికల్లో ఆ సంఖ్య 6,021కు చేరింది. దీంతో అనూహ్యంగా 3,962 ఓట్లు పెరిగినట్టయ్యింది.

ఇప్పటి నుంచే ప్రణాళికలు

గజ్వేల్-ప్రజ్ఞాపూర్ మున్సిపాలిటీపై కాంగ్రెస్ జెండాను ఎగురవేసేందుకు అధికార పార్టీ నాయకులు ఇప్పటి నుంచే ప్రణాళికలను సిద్ధం చేసుకుంటున్నారు. డీసీసీ అధ్యక్షుడు, గజ్వేల్ మాజీ ఎమ్మెల్యే నేతృత్వంలో పార్టీని మున్సిపాలిటీ పరిధిలో బలోపేతం చేసేందుకు కృషి చేస్తున్నారు. మాజీ మున్సిపల్ చైర్మన్‌తో పాటు మాజీ కౌన్సిలర్లు, మైనారిటీ నాయకులు, ఇతర సామాజిక వర్గాలకు చెందిన నాయకులను పెద్దఎత్తున కాంగ్రెస్ గూటికి చేర్చారు. పార్లమెంట్ ఎన్నికల్లో అనూహ్యంగా ఓట్లు పెరగడంతో రెట్టింపు ఉత్సాహం కనిపిస్తుంది. దీంతో వచ్చే ఎన్నికల్లో ఎలాగైనా గజ్వేల్-ప్రజ్ఞాపూర్ మున్సిపాలిటీని చేజిక్కించుకోవాలని కృత నిశ్చయంతో ఇప్పటినుంచే యత్నిస్తున్నారు. బీజేపీకి అనూహ్యంగా ఓట్లు రావడంతో రాబోయే కాలంలో ఆదరణ పెరగనున్నది. సరైన నాయకుడు లేకున్నా పార్టీకి ఆశించిన దానికంటే అత్యధిక ఓట్లు రావడం ఆ పార్టీ నాయకుల ఉత్సాహన్ని నింపింది. గత అసెంబ్లీ ఎన్నికల్లో బీజేపీ సీనియర్ నాయకుడు ఈటల రాజేందర్ పోటీ చేయడంతో అనూహ్య స్థాయిలో ఆదరణ దక్కింది. బీజేపీకి 7,403 ఓట్లు రాగా, ప్రస్తుత పార్లమెంట్ ఎన్నికల్లో మరో వెయ్యికిపైగా ఓట్లతో మరింత ఆదరణ దక్కించుకుంది. ఈ నేపథ్యంలో వచ్చే మున్సిపల్ ఎన్నికలపై బీజేపీ ఇప్పటినుంచే ఫోకస్ పెట్టింది. అయితే, బీఆర్ఎస్ ప్రతిపక్షంలో ఉండడం, అధికార కాంగ్రెస్ పార్టీ పుంజుకోవడం, బీజేపీ సత్తా చాటడంతో బీఆర్ఎస్‌కు ప్రతికూల పరిస్థితులు ఏర్పడ్డాయి. ఇప్పటివరకు ప్రస్తుత మున్సిపల్ పాలకవర్గం నుంచి బీఆర్ఎస్ కౌన్సిలర్లు చేజారక పోవడం కలసివచ్చే అంశమైనా ఏమేరకు పార్టీతో ఉంటారో తెలియని అయోమయం నెలకొన్నది. ఎఫ్‌డీసీ మాజీ చైర్మన్ ప్రతాప్‌రెడ్డి, ఎమ్మెల్సీ వంటేరి యాదవరెడ్డి పార్టీతోనే ఉండడంతో బీఆర్ఎస్‌కు బల్దియాపై ఆశలు చల్లారలేవు.

వలసలు పెరిగే అవకాశం

గజ్వేల్-ప్రజ్ఞాపూర్ మున్సిపాలిటీ పరిధిలో ఆయా పార్టీల్లోకి వలసలు భారీగా పెరిగే అవకాశాలు కనిపిస్తున్నాయి. ఇన్నాళ్లు పదవి ఆశించి బీఆర్ఎస్‌లో ఉన్నవారు, కౌన్సిలర్ సీటు కోసం పనిచేసిన వారు తమకు టికెట్‌పై హామీ దక్కకుంటే పార్టీ మారే అవకాశాలు పుష్కలంగా ఉన్నాయి. అంతేకాకుండా, గతంలో కౌన్సిలర్లుగా పోటీచేద్దామనుకుంటే కేసీఆర్ ఇలాకాలో బీఆర్ఎస్‌ను తట్టుకోవడం కష్టమనే భావనతో వెనుకడుగు వేయగా, ఆ పార్టీ బలం క్షీణించడంతో వారిలో ఆశలు చిగురించాయి. కాంగ్రెస్ పార్టీ అధికారంలో ఉండడంతో ఇదే అదనుగా పట్టణంలో ఎలాగైనా పట్టు సాధించాలని ప్రయత్నిస్తుంది. కీలక నేతలను తమవైపునకు తిప్పుకునేందుకు ఇప్పటికే ప్రయత్నాలు మొదలుపెట్టింది. ఇక బీజేపీకి మెదక్ ఎంపీగా రఘునందన్‌రావు ఉండడంతో ఆయన ప్రత్యేకంగా దృష్టి సారించే అవకాశాలున్నాయి. ఈ నేపథ్యంలో రాబోయే ఎన్నికల్లో బీజేపీ, కాంగ్రెస్ పార్టీల్లోకి వలసలు భారీగా కొనసాగుతాయని పలువురు భావిస్తున్నారు.

మూడేళ్ల నుంచి తిప్పించుకుంటున్నారు

- పరిహారం పూర్తిగా ఇచ్చాకే పనులు చేయండి
- తేల్చిచెప్పిన భూనిర్వాసితులు
- అదనపు టీఎంసీ కాలువ పనుల అడ్డగింత

తొగుట, జూన్ 10 : 'మూడేళ్ల నుంచి తిప్పించుకుంటున్నారు.. మాకు రావాల్సిన పూర్తి పరిహారం డబ్బు ఇచ్చిన తర్వాతనే పనులు చేయండి' అని మల్లన్నసాగర్ అదనపు టీఎంసీ కాలువ భూనిర్వాసితులు తేల్చిచెప్పారు. తొగుట మండలం బండారుపల్లి గ్రామ శివారులో చేపడుతున్న పనులను సోమవారం వారు అడ్డుకుని అక్కడే బైఠాయించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ బండారుపల్లి గ్రామంలో 90 ఎకరాల భూమిని సేకరించగా, అప్పుడు ఎకరాకు రూ.13 లక్షల ఇస్తామని అధికారులు నమ్మ బలికారని తెలిపారు. మొదటి విడతగా రూ.8 లక్షల ఇచ్చారని, మిగతా రూ.5 లక్షల కోసం మూడేళ్ల నుంచి తిప్పించుకుంటున్నారని మండిపడ్డారు. పూర్తి పరిహారం చెల్లించాకే ఇక్కడ పనులు చేయాలని, అప్పటివరకు ఇక్కడి నుంచి కదిలేది లేదన్నారు. విషయం తెలుసుకున్న ఇరిగేషన్ అధికారులు అక్కడి చేరుకుని రైతులతో మాట్లాడారు. వారం రోజుల్లో సమస్య పరిష్కారం చేస్తామని హామీ ఇచ్చినప్పటికీ పూర్తి పరిహారం అందిన తర్వాతనే పనులు చేపట్టాలని వారు తేల్చిచెప్పారు. అప్పటివరకు పనులు జరగనీయమని హెచ్చరించారు. రైతులు ఎల్లయ్య, దేవయ్య, చిన్నఎల్లయ్య, నర్సింలు, బాల్‌రాజు, దుర్గయ్య, రమేష్, తదితరులు పాల్గొన్నారు.



తొగుట మండలం బండారుపల్లి గ్రామ శివారులో అదనపు టీఎంసీ కాలువ పనులను అడ్డుకుంటున్న భూ నిర్వాసితులు

ప్రజావాణికి 14 ఫిర్యాదులు

- పునఃప్రారంభమైన గ్రీవెన్స్.. అర్జీలను స్వీకరించిన కలెక్టర్
- సమస్యలను వెంటనే పరిష్కరించాలని ఆదేశం



బాధితుల నుంచి దరఖాస్తులను స్వీకరిస్తున్న కలెక్టర్ మనుచౌదరి

సిద్దిపేట అగ్రికల్చర్, జూన్ 10: లోక్‌సభ ఎన్నికల కోడ్ ముగియడంతో కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో సోమవారం ప్రజావాణి కార్యక్రమాన్ని పునఃప్రారంభించారు. చాలా రోజుల తర్వాత ప్రారంభమవడంతో ప్రజావాణికి 14 ఫిర్యాదులు మాత్రమే అందాయి. అదనపు కలెక్టర్ శ్రీనివాస్‌రెడ్డితో కలిసి కలెక్టర్ మను చౌదరి బాధితుల నుంచి అర్జీలను స్వీకరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ సమస్యల పరిష్కారానికి జిల్లాలోని నలుమూలల నుంచి బాధితులు ఎన్నో వ్యయప్రయాలకు ఓర్చి వస్తారని, అర్జీలను పెండింగ్‌లో పెట్టకుండా ఎప్పటికప్పుడు పరిశీలించాలన్నారు. ప్రజావాణి 10.36 గంటలకు ప్రారంభం కాగా పది మంది జిల్లా అధికారులు కూడా లేకపోవడం గమనార్హం.

నష్టపరిహారం అందించాలి

రైల్వేలైన్ నిర్మాణంలో కోల్పోతున్న తమ స్థలాలకు నష్టపరిహారం అందించాలని చిన్నకోడూరు మండలం పెద్దకోడూరుకు చెందిన భూనిర్వాసితులు ప్రజావాణిలో అధికారులకు మొరపెట్టుకున్నారు. అంతకుముందు కలెక్టరేట్ వద్ద నిరసన వ్యక్తం చేశారు. 2006లో 500 మంది ఓ వెంచర్‌లో స్థలాలు కొనుగోలు చేశామని, తీరా ఇప్పుడు రైల్వేలైన్ ప్రాజెక్టు నిర్మాణంతో ఆ స్థలాలను తీసుకున్నారని వాపోయారు. లక్షల విలువైన భూములకు నామమాత్రపు పరిహారం ఇస్తామనడం సరికాదన్నారు. తమకు ఎలాంటి నోటీసులు లేకుండా పనులు ప్రారంభించడానికి రైల్వే అధికారులు సైతం సన్నద్ధం అవుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. తమ స్థలానికి బదులు మరోచోట స్థలం ఇవ్వాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో ఆందోళన కార్యక్రమాలు నిర్వహిస్తామని వారు హెచ్చరించారు.

రైల్వేలైన్‌కు త్వరగా భూసేకరణ పూర్తిచేయాలి : కలెక్టర్

సిద్దిపేట అగ్రికల్చర్, జూన్ 10 : రైల్వేలైన్ నిర్మాణానికి అవసరమైన భూసేకరణ త్వరగా పూర్తి చేయాలని కలెక్టర్ మను చౌదరి అధికారులను ఆదేశించారు. కలెక్టర్ కార్యాలయంలోని మినీ కాన్ఫరెన్స్‌హాల్లో మనోహరాబాద్- కొత్తపల్లి రైల్వేలైన్ భూసేకరణపై రెవెన్యూ, రైల్వేశాఖ అధికారులతో సోమవారం సమీక్షించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. చిన్నకోడూరు మండలంలోని పెద్దకోడూరు, చిన్నకోడూరు, మాచాపూర్, గంగాపూర్, విఠలాపూర్ గ్రామాలు, నారాయణరావుపేట మండలంలోని గుర్రాలగొంది, జక్కాపూర్ గ్రామాల్లో మొత్తం 25.30 ఎకరాల భూమిని ఇంకా రైల్వే నిర్మాణానికి సేకరించాల్సి ఉందన్నారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ శ్రీనివాస్ రెడ్డి, సిద్దిపేట ఆర్డీవో సదానందం, రైల్వే సీనియర్ సెక్షన్ ఇంజనీర్ జనార్ధన్, సిద్దిపేట అర్బన్, నారాయణరావుపేట, చిన్నకోడూరు మండలాల తహసీల్దార్లు పాల్గొన్నారు.

ఫిట్‌లెస్ బస్సులు

రేపటి నుంచి బడులు పునఃప్రారంభం కానుండగా, మరోవైపు ప్రైవేటు విద్యాసంస్థల యాజమాన్యాలు స్కూల్ బస్సుల ఫిట్‌నెస్‌పై నిర్లక్ష్యం వహిస్తున్నాయి. సాధారణంగా బస్సుల సామర్థ్యాన్ని బడుల ప్రారంభానికి ముందే పరీక్షించడం పూర్తవ్వాలి. రవాణా శాఖ అధికారుల నుంచి ధ్రువీకరణ పత్రాలు పొందిన తర్వాతే రోడ్లపైకి రావాలి. కానీ, ఇప్పటివరకు జిల్లాలోని సగం స్కూల్ బస్సులు కూడా ఫిట్‌నెస్‌ను పూర్తి చేసుకోలేదు. ప్రైవేటు విద్యాసంస్థలు అడ్మిషన్లపై చూపుతున్న శ్రద్ధ బడి బస్సుల ఫిట్‌నెస్‌పై చూపడం లేదనే ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. భద్రతలేని బస్సులతో అనుకోకుండా ఏదైన ప్రమాదం సంభవిస్తే.. అప్పుడుగానీ రవాణా శాఖ అధికారులు కళ్లుతెరుచుకునేలా కనిపించడం లేదు.

- సిద్దిపేట క్రైం, జూన్ 10

మొత్తం 372

ఫిట్‌నెస్ పూర్తయినవి 170

భద్రతపై ఎవరిది భరోసా?

- స్కూల్ యజమాన్యాల నిర్లక్ష్య ధోరణి
- రేపటి నుంచి బడుల పునఃప్రారంభం
- ప్రశ్నార్థకంగా ఆర్టీఏ అధికారుల తీరు

సిద్దిపేట క్రైం, జూన్ 10 : ఓవైపు రేపటి నుంచి బడులు పునఃప్రారంభం కానుండగా, మరోవైపు ప్రైవేటు విద్యాసంస్థల యాజమాన్యాలు స్కూల్ బస్సుల ఫిట్‌నెస్‌పై నిర్లక్ష్యం వహిస్తున్నాయి. సాధారణంగా బస్సుల సామర్థ్యాన్ని బడుల ప్రారంభానికి ముందే పరీక్షించడం పూర్తవ్వాలి. రవాణా శాఖా అధికారుల నుంచి ధ్రువీకరణ పత్రాలు పొందిన తర్వాతే రోడ్లపైకి రావాల్సి ఉంటుంది. ఇప్పటివరకు జిల్లాలోని సగం బస్సులు కూడా ఫిట్‌నెస్‌ను పూర్తి చేసుకోలేదు. ప్రైవేటు విద్యాసంస్థలు అడ్మిషన్లపై చూపుతున్న శ్రద్ధ బడి బస్సుల ఫిట్‌నెస్‌పై చూపడం లేదనే ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి.

నిబంధనల ప్రకారం..

జిల్లాలో 250 ప్రైవేటు స్కూళ్లలో 372 బస్సులు ఉన్నాయి. జిల్లా కేంద్రంతో పాటు గజ్వేల్, హుస్నాబాద్, చేర్యాల, దుబ్బాక పట్టణాలకు సుమారు 20 కిలోమీటర్ల పరిధిలోని గ్రామాల నుంచి ప్రతీరోజు విద్యార్థులను ఆయా స్కూళ్లకు చేరవేస్తుంటాయి. ఈ 372 బస్సుల్లో ఇప్పటివరకు 170 బస్సులు మాత్రమే ఫిట్‌నెస్ పూర్తిచేసుకున్నాయి. మిగతా 202 ఫిట్‌నెస్‌ను పూర్తి చేసుకోలేదు. నిబంధనల ప్రకారం ఇంజన్ కండీషన్, టైర్లు, బ్రేక్‌ల నాణ్యత, డ్రైవర్‌కు కనబడేలా ఇరువైపులా సైడ్ అద్దాలు, నాలుగు వైపులా రేడియం స్టిక్కర్లు, గాలి వెలుతురు వచ్చేలా కిటికీలు, సీట్ల మధ్య రాడ్లు, మెడికల్ కిట్లు, 325 మిల్లీమీటర్ల ఎత్తులో బస్సు మెట్లు.. ఇలా అన్నింటినీ తనిఖీ చేసి, సరిగ్గా ఉంటేనే ఆర్టీవో అధికారులు వాటికి ఫిట్‌నెస్ సర్టిఫికెట్‌ను జారీ చేస్తారు. వారు ధ్రువీకరించకుండా ఏ విద్యాసంస్థకు సంబంధించిన వాహనమైనా రోడ్డెక్కేందుకు వీలులేదు.



సిద్దిపేట రవాణా శాఖ కార్యాలయంలో స్కూల్ బస్సులకు ఫిట్‌నెస్ టెస్ట్ చేస్తున్న అధికారులు

తనిఖీలు నిర్వహించేనా?

ఇంకా 202 బస్సుల ఫిట్‌నెస్ పూర్తి కాకపోవడంతో అవి విద్యార్థులతో రోడ్డెక్కితే ఏదైనా జరగరానిది జరిగితే ఎవరిది బాధ్యత అని తల్లిదండ్రుల్లో భయాందోళన వ్యక్తమవుతున్నది. రవాణా శాఖ అధికారులు తీరు ప్రశ్నార్థకంగా మారింది. పాఠశాల యజమానులతో ఆర్టీఏ అధికారులు కుమ్మక్కైనట్లు ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. నిబంధనల ప్రకారం బస్సులు సరిగ్గా లేకున్నా రవాణా శాఖ అధికారులు ఉదాసీనంగా వ్యవహరిస్తున్నట్లు సమాచారం. ఫిట్‌నెస్‌పై రవాణా శాఖ అధికారులు స్కూల్ యాజమాన్యాలకు కచ్చితంగా అవగాహన కల్పించాల్సి ఉంటుంది. ఇప్పటివరకు ఎలాంటి సమావేశం నిర్వహించలేదు. ఫిట్‌నెస్ పూర్తి కాని బస్సులు రోడ్డెక్కితే తనిఖీలు నిర్వహిస్తారో చూడాలి. నిబంధనలకు విరుద్ధంగా నడిపితే చట్ట ప్రకారం చర్యలు తీసుకోవాల్సి ఉంటుంది. సంవత్సరం నుంచి ఇప్పటివరకు ఆర్టీవో అధికారులు జిల్లాలో ఫిట్‌నెస్ లేని ఒక్క బస్సును కూడా సీజ్ చేయలేదు. ఈ సారైన కొరడా ఝుళిపించి బస్సుల భద్రతపై భరోసా కల్పిస్తారో లేదో వేచిచూడాలి

గంగోజిపేటలో ముగిసిన క్రికెట్ టోర్నీ



విజేత శివ్వంపేట జట్టుకు మెమెంటో అందజేస్తున్న రామచంద్రారెడ్డి

పుల్‌కల్, జూన్ 10: చౌటకూర్ మండలం గంగోజిపేట గ్రామంలో గడిచిన పక్షం రోజులుగా జరుగుతున్న వేసవి క్రికెట్ పోటీలు సోమవారం ముగిశాయి. గ్రామానికి చెందిన ఫస్ట్ మీస్ట్ ప్రైవేట్ లిమిటెడ్ కంపెనీ మేనేజింగ్ డైరెక్టర్ మొండెద్దుల నటరాజ్‌రెడ్డి తన తాత మొండెద్దుల సుబ్బారెడ్డి జ్ఞాపకార్థం ఉమ్మడి పుల్కల్ మండల స్థాయిలో వేసవి క్రికెట్ పోటీలను ప్రతీ ఏటా నిర్వహిస్తుంటారు. ఇందులో భాగంగా నిర్వహించిన ఈ టోర్నీలో 35 జట్లు పాల్గొన్నాయి. సోమవారం జరిగిన ఫైనల్‌లో శివ్వంపేట జట్టు గంగోజిపేట జట్టును ఓడించి విజేతగా నిలిచింది. విజేత జట్టుకు రూ.20 వేలు నగదు, మెమెంటో, రన్నర్‌గా నిలిచిన గంగోజిపేట జట్టుకు రూ.10 వేలతో పాటు మెమెంటోను అందజేశారు. కార్యక్రమానికి ముఖ్యఅతిథులుగా డీసీసీబీ మాజీ డైరెక్టర్ రాంసాని రామచంద్రారెడ్డి, సీడీసీ మాజీ చైర్మన్ భూంరెడ్డి సుభాష్‌రెడ్డిలు హాజరై క్రీడాకారులకు మెమెంటోలను అందజేశారు. కార్యక్రమంలో గంగోజిపేట మాజీ సర్పంచ్ శ్రీనివాస్‌రెడ్డి, సుల్తాన్‌పూర్ మాజీ ఉప సర్పంచ్ శ్రీనివాస్‌రెడ్డి, నాయకులు పార్కల రాంరెడ్డి, కుమ్మరి అశోక్, బుర్రెడ్డి మాణిక్ రెడ్డి, కె.చంద్రం తదితరులు పాల్గొన్నారు.

గుమ్మడిదల నుంచి ఏడు పాయల వరకు
బీజేపీ నాయకుల పాదయాత్ర


గుమ్మడిదల/నర్సాపూర్, జూన్ 10 : బీజేపీ మెదక్ ఎంపీగా రఘునందన్‌రావు విజయం సాధించడంతో గుమ్మడిదల మండలానికి చెందిన బీజేపీ నాయకులు ఏడుపాయల దుర్గామాత ఆలయానికి సోమవారం పాదయాత్రగా బయలుదేరారు. పార్లమెంట్ ఎన్నికల సందర్భంగా రఘునందన్‌రావు గెలిస్తే ఏడుపాయలకు పాదయాత్ర చేస్తామని మొక్కుకున్నట్టు వారు తెలిపారు. దీంతో సోమవారం గుమ్మడిదల మండల బీజేపీ జిల్లా యువమోర్చా ఉపాధ్యక్షుడు చెన్నం శెట్టి ఉదయ్ కుమార్ ఆధ్వర్యంలో ఏడుపాయల దుర్గామాత ఆలయం వరకు మొక్కుబడి చెల్లించేందుకు పాదయాత్ర చేపట్టగా కార్యకర్తలు పెద్ద ఎత్తున తరలి వెళ్లారు. సోమవారం ఉదయం మెదక్ జిల్లాలోని నర్సాపూర్‌కు పాదయాత్ర బృందం చేరుకోగా నర్సాపూర్‌కు చెందిన బీజేపీ నాయకులు జిల్లా ఉపాధ్యక్షుడు గోడరాజేందర్, అసెంబ్లీ కన్వీనర్ రమణరావు, కౌన్సిలర్ బుచ్చేస్‌యాదవ్, పట్టణ అధ్యక్షుడు అంజిగౌడ్ తదితరులు ఘనంగా స్వాగతం పలికి పాదయాత్రకు తమవంతు సంపూర్ణ మద్దతు తెలిపారు.




నర్సాపూర్‌లో పాదయాత్రకు స్వాగతం పలుకుతున్న బీజేపీ నాయకులు

















జిన్నారంలో కోర్టు ఏర్పాటు కోసం స్త్రీ శక్తి భవనాన్ని పరిశీలిస్తున్న జిల్లా కోర్టు ఏవో, ఎంపీపీ, న్యాయవాదులు

సివిల్ జడ్జి కోర్టు కోసం భవనాల పరిశీలన

జిన్నారం, జూన్ 10: మండల కేంద్రం జిన్నారంలో జూనియర్ సివిల్ జడ్జి, జూడిషియల్ మేజిస్ట్రేట్ ఫస్ట్ క్లాస్ కోర్టు ఏర్పాటు కోసం సోమవారం అధికారులు, న్యాయవాదులు భవనాన్ని పరిశీలించారు. తహసీల్దార్ కార్యాలయ ఆవరణలో ఉన్న స్త్రీ శక్తి భవనాన్ని జిల్లా న్యాయస్థానం ఏవో శ్యామల, ఎంపీపీ రవీందర్‌గౌడ్, నర్సాపూర్ బార్ కౌన్సిల్ అధ్యక్షుడు శ్రీధర్‌రెడ్డిలు పరిశీలించారు. రాష్ట్ర ప్రభుత్వం ఇటీవల జిన్నారంలో సివిల్ జడ్జి కోర్టు ఏర్పాటుకు అనుమతి ఇవ్వగా, అనువైన భవనాల కోసం పరిశీలన జరిపారు. ఉపాధి హామీ స్త్రీ శక్తి భవనం కోర్టు ఏర్పాటుకు అనుకూలంగా ఉందని స్థానికులు అధికారులకు వివరించారు. భవనాలు పరిశీలించిన తర్వాత అధికారులకు నివేదిక అందజేస్తామని ఏవో తెలిపారు. కోర్టు ఏర్పాటుకు మండల పరిషత్ నుంచి సహకారం అందిస్తామని ఎంపీపీ రవీందర్‌గౌడ్ తెలిపారు. కార్యక్రమంలో న్యాయవాదులు అంజిరెడ్డి, శ్రీనివాస్‌గౌడ్, శంకర్‌రెడ్డి, సత్యనారాయణ, మధుశ్రీ, స్వరూపారాణి, బాలకృష్ణ, వివిధ పార్టీల నాయకులు జనార్ధన్‌గౌడ్, రాజిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

జేఈఈ అడ్వాన్స్‌లో గిరిజన గురుకులం ప్రతిభ

నర్సాపూర్,జూన్ 10: జేఈఈ అడ్వాన్స్ ప్రవేశ పరీక్షలో నర్సాపూర్ గిరిజన గురుకుల విద్యార్థులు ప్రతిభ చాటారని ప్రిన్సిపల్ భిక్షమయ్య తెలిపారు. సోమవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ ఈ.మారుతికుమార్ అనే విద్యార్థి జేఈఈ అడ్వాన్స్‌లో 92 మార్కులు సాధించి ఎస్టీ విభాగంలో 391 ర్యాంకు సాధించినట్లు చెప్పారు. మొత్తం 17 మంది విద్యార్థులు హాజరు కాగా, నాలుగు నేరుగా ఐఐటీలో ర్యాంకులు, 5గురు ప్రియారిటీ ర్యాంకులు సాధించినట్లు తెలిపారు. ఇద్దరు ఎన్ఐటీలో, ముగ్గురు ట్రిబుల్ ఐటీలో సీట్లు పొందే అవకాశం పొందినట్లు పేర్కొన్నారు. ప్రతిభ చాటిన విద్యార్థులను రీజినల్ కోఆర్డినేటర్ సంపత్‌కుమార్‌తో పాటు అధ్యాపక బృందం ప్రత్యేకంగా అభినందించినట్లు ప్రిన్సిపాల్ తెలిపారు.

మెదక్‌ను ఆదర్శంగా తీర్చిదిద్దాలి



సమీక్షాసమావేశంలో ఎమ్మెల్యే రోహిత్, జేసీ వెంకటేశ్వర్లు. తదితరులు

మెదక్, జూన్ 10: అధికారులు, ప్రజాప్రతినిధులు కలిసికట్టుగా పనిచేస్తూ మెదక్ నియోజకవర్గాన్ని ఆదర్శవంతంగా తీర్చిదిద్దడానికి శాయశక్తులా కృషిచేద్దామని ఎమ్మెల్యే మైనంపల్లి రోహిత్ సూచించారు. సోమవారం రాత్రి జిల్లా కలెక్టరేట్ కార్యాలయంలోని సమావేశ మందిరంలో అటవీ, పోలీసు, వ్యవసాయ, ఉద్యానవన, సహకార, మెప్మా, ఎస్సీ, ఎస్టీ అభివృద్ధి, శిశుసంక్షేమ, మత్స్య శాఖ, మున్సిపల్, మైన్స్, సివిల్ సప్లై, ఎక్సైజ్, విద్య, విద్యుత్, లేబర్, పంచాయితీ రాజ్, ఆర్ అండ్ బీ, తదితర శాఖల అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో అదనపు కలెక్టర్ వెంకటేశ్వర్లు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ నూతన ప్రభుత్వంలో అధికారులు సమన్వయంతో పనిచేసి ప్రభుత్వ పథకాలను ప్రజలకు అందజేసి ప్రభుత్వానికి మంచిపేరు తేవాలని సూచించారు. అక్రమ ఇసుక తరలించే వారిపైన కఠిన చర్యలు తీసుకోవాలని, పేదవారు గృహనిర్మాణం కోసం ఇసుక తరలించే వారినిపై కాకుండా అక్రమంగా ఇసుక రవాణా చేసే వారిని ఉపేక్షించరాదన్నారు. ఎరువులు, విత్తనాలు రైతులకు అందుబాటులో ఉంచాలని, ఒకవేళ కృత్రిమ కొరత తలెత్తితే తనను నేరుగా సంప్రదించాలని వ్యవసాయ అధికారులకు సూచించారు. సమావేశంలో జడ్పీ సీఈవో ఎల్లయ్య, డీఆర్డీవో శ్రీనివాసరావు, ఆర్డీవో రమాదేవి, మున్సిపల్ చైర్మన్ చంద్రపాల్, జిల్లా అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

రండి బాబు.. మా బడికే రండి..!

● ప్రభుత్వ, ప్రైవేట్ ఉపాధ్యాయుల ప్రచారం



బడిబాట కార్యక్రమాన్ని నిర్వహిస్తున్న ఉపాధ్యాయులు

కుకునూరుపల్లి, జూన్ 10: మొన్నటి వరకు ఎన్నికల ప్రచారంతో హోరెత్తిన గ్రామాల్లో ఇప్పుడు విద్యాసంస్థల ప్రచారం జోరుగా సాగుతోంది. తమ పాఠశాలలో చేర్పించాలని ప్రభుత్వ ఉపాధ్యాయులు, తమ స్కూల్‌లో చేర్పించాలని ప్రైవేటు టీచర్లు ప్రచారం చేస్తున్నారు. పాఠశాలలు పునః ప్రారంభం కావడానికి సమయం దగ్గర పడుతుండటంతో హోరాహోరీగా ప్రచారం చేస్తున్నారు.

అన్ని ఉచితం అంటున్న ప్రభుత్వ బడి

ప్రభుత్వ పాఠశాలలో చేరితే అన్ని ఉచితం అంటూ ప్రభుత్వ ఉపాధ్యాయులు ప్రచారం నిర్వహిస్తున్నారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రొఫెసర్ జయశంకర్ బడిబాట కార్యక్రమాన్ని జూన్ 6 నుంచి 19 వరకు నిర్వహిస్తున్న విషయం తెలిసిందే. దీంతో ప్రభుత్వ పాఠశాలల ఉపాధ్యాయులు ప్రభుత్వ పాఠశాలలోనే తమ పిల్లలను చేర్పించాలని తల్లిదండ్రులు కోరుతున్నారు. మధ్యాహ్న భోజనం, రెండు జతల యూనిఫాం, పాఠ్య పుస్తకాలు, నోట్‌బుక్స్ ఇతర సౌకర్యాలు ఉచితంగా ప్రభుత్వ పాఠశాలలో అందుతున్నాయని, ప్రైవేటు పాఠశాలలు అయితే స్కూల్ ఫీజు, బస్సు ఫీజు, పుస్తకాలు, యూనిఫామ్స్ ఇతర కార్యక్రమాలకు అదనంగా డబ్బులు ఖర్చు చేయాల్సి ఉంటుందని చెబుతున్నారు. కుకునూరుపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల మరో ముందుకు వేసి ప్రధానోపాధ్యాయుడి సారథ్యంలో సిబ్బంది సహకారంతో ఈ సంవత్సరం పదో తరగతిలో తమ విద్యార్థులు సాధించిన ర్యాంకులతో పాంప్లెంట్స్ ముద్రించి ప్రైవేటు దీటుగా ప్రచారం నిర్వహిస్తున్నారు.

అన్ని ర్యాంకులు మావే అంటున్న ప్రైవేటు విద్యాసంస్థలు

నర్సరీ నుంచి పదో తరగతి వరకు ఇంగ్లిష్ మీడియంలోనే బోధిస్తామని, పదో తరగతిలో అత్యధిక ర్యాంకులు ప్రభుత్వ పాఠశాలలో కంటే మాకే ఎక్కువ వస్తాయని ప్రచారం నిర్వహిస్తున్నారు. ప్రభుత్వం చేపట్టిన బడిబాట కార్యక్రమానికి 15 రోజుల ముందు నుండే ప్రైవేటు పాఠశాలల యాజమాన్యం తమ సిబ్బందితో గ్రామాలలో దింపారు. మండల కేంద్రంలో ఉన్న ప్రైవేటు విద్యా సంస్థలతోపాటు ఇటు సిద్దిపేట అటు గజ్వేల్ పట్టణాల నుంచి మండలంలోని గ్రామాలలో తమ సిబ్బందితో బస్సులలో వచ్చి ఉదయమే ఏడు గంటల నుండే గ్రామాల్లో ప్రచారం నిర్వహిస్తున్నారు. తమ విద్యార్థులు పదో తరగతిలో సాధించిన ర్యాంకులతో ఉన్న కరపత్రాలతో పాటు తమ విద్యాసంస్థలో ఎలా బోధిస్తున్నామో వివరిస్తూ ప్రచారం నిర్వహిస్తున్నారు.

ప్రైవేట్‌కే మొగ్గు..

ప్రభుత్వ పాఠశాలల ఉపాధ్యాయులు ఎన్ని చెప్పినా.. కొందరు విద్యార్థుల తల్లిదండ్రులు మాత్రం ప్రైవేట్ విద్యాసంస్థల వైపే మొగ్గుచూపుతున్నట్లు తెలుస్తోంది. ప్రభుత్వ పాఠశాలల్లో విద్యాబోధన సరిగ్గా జరగదని, ప్రైవేట్‌లో పిల్లలను చదివిస్తే ఇంగ్లిష్‌లో మాట్లాడుతారని, మంచి ర్యాంకులు వస్తాయన్న భావనలో ప్రైవేట్‌లో చేర్పించేందుకు ఇష్టపడుతున్నట్లు సమాచారం.



పాంప్లెంట్స్ ముద్రించి ప్రచారం నిర్వహిస్తున్న కుకునూరుపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల

ద్విచక్ర వాహనాన్ని ఢీ కొట్టిన ఆర్టీసీ బస్సు

● అక్కడికక్కడే మహిళా కూలి మృతి

● మరో మహిళ పరిస్థితి విషమం



హుస్నాబాద్ ప్రభుత్వ హాస్పటల్ దగ్గర దర్నా చేసున్న బంధువులు, గిరిజన సంఘాల నాయకులు



కరెంటొతు కవిత(ఫైల్)

అక్కన్నపేట, జూన్ 10: రెక్కాడితే గాని డొక్కాడని గిరిజన కూలీలను ఆర్టీసీ బస్సు రూపంలో మృత్యువు కబళించింది. భవన నిర్మాణ కూలి పనులకు వెళ్తున్న ద్విచక్ర వాహనాన్ని ఆర్టీసీ బస్సు ఢీ కొట్టడంతో మహిళ కూలి మృతి చెందింది. ఈ ప్రమాదం ఒకరికి తీవ్ర గాయాలు కాగా మరో మహిళా కూలి పరిస్థితి విషమంగా ఉంది. ఈ సంఘటన సోమవారం అక్కన్నపేట మండల కేంద్రంలోని పెట్రోల్ బంకు సమీపంలోని పంతులు తండా క్రాస్ రోడ్ వద్ద చోటు చేసుకుంది. స్థానికులు, పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం అక్కన్నపేట మండలం పంతులు తండా గ్రామానికి చెందిన కరెంటొతు రాజు-స్వరూప దంపతులతోపాటు రాజు మరదలు కరెంటొతు కవిత(35)కలిసి అక్కన్నపేటలో జరుగుతున్న భవన నిర్మాణ కూలి పనులకు ఏపీ 09 బీజడ్ 7791 నెంబరు గల ద్విచక్ర వాహనంపై బయలుదేరారు. పంతులు తండా క్రాస్ రోడ్ వద్దకు రాగానే హుస్నాబాద్ నుంచి జనగామకు వెళుతున్న టీఎస్ 36 టీ7327అనే నెంబర్ గల హుస్నాబాద్ డిపోకు చెందిన హైయిర్ విత్ ఆర్టీసీ బస్సు ద్విచక్ర వాహనాన్ని ఢీ కొట్టింది. ఈ సంఘటనలో కవిత అక్కడికక్కడే మృతిచెందగా రాజు, స్వరూప తీవ్రంగా గాయపడ్డారు. వీరిని 108 అంబులెన్స్ ద్వారా వరంగల్ ఎంజీఎం హాస్పిటల్‌కు తరలించారు. ఇందులో స్వరూప పరిస్థితి విషమంగా ఉంది. మృతిచెందిన కవితకు భర్త రవితో పాటు ఇద్దరు కుమారులు ఉన్నారు.

కుటుంబ సభ్యుల ధర్నా

కవిత కుటుంబ సభ్యులతోపాటు తీవ్రంగా గాయపడ్డ రాజు స్వరూప కుటుంబ సభ్యులకు పరిహారం చెల్లించాలని తండావాసులు రహదారిపై ఆందోళన చేశారు. సంఘటన స్థలానికి చేరుకున్న ఎస్ఐ తాండ్ర వివేక్ ఆందోళనకారులను సముదాయించి తగు న్యాయం చేస్తామని హామీ ఇవ్వడంతో ఆందోళన విరమించారు. అనంతరం కవిత మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం హుస్నాబాద్ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. అయితే, ఆస్పత్రి వద్ద కూడా బంధువులతో పాటు గిరిజన సంఘాల నాయకులు మూడు గంటల పాటు దర్నా నిర్వహించారు. ప్రమాదానికి కారణమైన డ్రైవర్‌పై చర్యలు తీసుకోవాలని, కవిత కుటుంబ సభ్యుల్లో ఒకరికి ప్రభుత్వ ఉద్యోగం ఇవ్వాలని, ఆర్థికంగా ఆదుకోవాలని డిమాండ్ చేశారు. హుస్నాబాద్ ఏసీపీ సతీష్ దర్నా చేస్తున్న వారిని సముదాయించి న్యాయం చేస్తామని హామీ ఇవ్వడంతో దర్నా విరమించారు.



అవార్డులు అందజేస్తున్నసీఎం రేవంత్‌రెడ్డి

'ప్రతిభ'కు పురస్కారం

నారాయణఖేడ్, జూన్ 10: పదో తరగతిలో అత్యుత్తమ ఫలితాలు సాధించిన నారాయణఖేడ్ ప్రభుత్వ బాలికల ఉన్నత పాఠశాల విద్యార్థినులు సోమవారం హైదరాబాద్ సీఎం రేవంత్‌రెడ్డి నుంచి ప్రతిభా పురస్కారాలు అందుకున్నారు. సాయికీర్తన, వైష్ణవి పదో తరగతిలో 10 జీపీఏ సాధించడంతో వందేమాతరం ఫౌండేషన్ రాష్ట్రస్థాయి ప్రతిభా పురస్కారాలను అందజేశారు. హైదరాబాద్‌లోని రవీంద్రభారతిలో జరిగిన కార్యక్రమంలో సీఎం రేవంత్‌రెడ్డి వారికి పురస్కారాలు అందజేశారు. హెచ్ఎం అనూరాధకు కూడా అవార్డు అందించారు.

బెల్ట్‌షాప్‌లపై చిట్యాల మహిళల సమరం

● మద్యం విక్రయించవద్దని నిరసన



చిట్యాల గ్రామంలో బెల్టుషాపుల వద్ద ఆందోళన చేస్తున్న మహిళలు

చేర్యాల, జూన్ 10: చేర్యాల మండలం చిట్యాల గ్రామానికి చెందిన పలువురు మహిళలు మద్యం విక్రయాలపై కన్నెర్ర చేస్తున్నారు. గ్రామంలో 10కిపైగా బెల్ట్‌షాపులు ఏర్పాటు చేసి విచ్చలవిడిగా మద్యం విక్రయిస్తున్నారని పేర్కొంటూ ఆందోళనకు దిగారు. బెల్ట్‌షాపుల్లో మద్యం విక్రయాలు నిలిపివేయాలని ఇటీవల ఎక్సైజ్ అధికారులకు విన్నవించినా ఎలాంటి చర్యలు చేపట్టకపోవడంతో ఇక తామే రంగంలోకి దిగారు. సోమవారం మహిళలంతా కలిసి గ్రామంలోని ప్రతీ బెల్టుషాపు వద్దకు వెళ్లి నిరసన చేపట్టారు. మద్యం విక్రయాలు మానేయాలని, మద్యం కోసం మగవారు కూలీ, నాలీ చేసిన డబ్బులు లాక్కుంటుండటంతోపాటు తమ పుస్తెలు అమ్ముకుంటున్న పరిస్థితి నెలకొందని, మహిళలను చితకబాదడమే కాకుండా హత్యాయత్నాలకు పాల్పడుతున్న దుస్థితి నెలకొందంటూ వాపోయారు. గ్రామంలో మద్యం విక్రయిస్తే ఊరుకోబోమని, ముందస్తుగా శాంతియుతంగా తెలుపుతున్నామని, కాదని నిర్లక్ష్యం చేస్తే నిత్యం షాపుల్లో మద్యం ధ్వంసం చేయడంతో పాటు ఆందోళన కొనసాగిస్తామని సూచించారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వస్తే బెల్టుషాపులు తొలగిస్తామని సీఎం రేవంత్‌రెడ్డి చెప్పినప్పటికీ మద్యం ఏరులై పారుతుందని వాపోయారు. తమ గ్రామంలో నెలకొన్న పరిస్థితిని గుర్తించి బెల్ట్‌షాపులు తొలగించి మద్యం విక్రయాలు జరపకుండా చర్యలు తీసుకోవాలని కోరారు.

16న శ్రీరామ శిల శోభాయాత్ర



కర పత్రాలను విడుదల చేస్తున్న జ్యోతిర్వాస్తు విద్యా పీఠం వ్యవస్థాపకులు మహేశ్వర శర్మ సిద్ధాంతి

సంగారెడ్డి టౌన్, జూన్ 10: శ్రీ జ్యోతిర్వాస్తు విద్యాపీఠం ఆధ్వర్యంలో ఈ నెల 16న శ్రీరామ శిల శోభాయాత్ర నిర్వహించనున్నట్టు విద్యాపీఠం వ్యవస్థాపకులు బ్రహ్మశ్రీ డాక్టర్ శ్రీ మహేశ్వర శర్మ సిద్ధాంతి తెలిపారు. సంగారెడ్డి మండలం ఫసల్‌వాదిలోని విద్యాపీఠంలో సోమవారం ఇందుకు సంబంధించిన కర పత్రాలను విడుదల చేశారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఈ నెల 16న మధ్యాహ్నం 1 గంటలకు పోతిరెడ్డిపల్లి చౌరస్తాలోని సంగమేశ్వర దేవాలయం వద్ద శిలాయాత్ర ప్రారంభవుతుందని చెప్పారు. యాత్రలో పదివేల మంది భక్తులు పాల్గొంటారని పేర్కొన్నారు. 13 కోట్ల రామనామ జపం యాత్రలో జరుగుతుందని, వెయ్యి మంది మహిళలు కలశాలు ధరిస్తారని వివరించారు. రాత్రి 8 గంటలకు ఫసల్‌వాదిలోని శ్రీ జ్యోతిర్వాస్తు విద్యాపీఠంకు యాత్ర చేరుకుంటుందన్నారు. రామా,సీత, లక్ష్మణ, భరత, శత్రుఘ్న, హనుమాన్, సుగ్రీవ, అంగద, విభీషణ, జాంబవంత సమేతుడై రామచంద్రమూర్తిలను ఏక కృష్ణశిలలో నిర్మాణం చేయాలనే సంకల్పంతో ఈ మహత్ కార్యక్రమానికి శ్రీకారం చుట్టామని వివరించారు. 18 అడుగుల పొడువు, 7 అడుగుల వెడల్పు, 10 అడుగుల ఎత్తుతో భారీ శిలపై ప్రఖ్యాతి చెందిన శిల్పాలతో విగ్రహాలను చెక్కిస్తున్నామని తెలిపారు. కార్యక్రమాన్ని దిగ్విజయం చేయాలని మహేశ్వరశర్మ సిద్ధాంతి కోరారు. ఈ సమావేశంలో విద్యాపీఠం సభ్యులు తోపాజి అనంతకృష్ణ, ప్రశాంత్‌కుమార్, సెంథిల్, విద్యాసాగర్ తదితరులు పాల్గొన్నారు.

అక్షరాస్యత పెంపే లక్ష్యంగా పని చేయాలి

● కలెక్టర్ రాహుల్ రాజ్



సమీక్షలో మాట్లాడుతున్న జిల్లా కలెక్టర్ రాహుల్ రాజ్

మెదక్ అర్బన్, జూన్ 10: జిల్లాలో వందశాతం అక్షరాస్యతే లక్ష్యంగా అధికారులు పని చేయాలని కలెక్టర్ రాహుల్ రాజ్ పిలుపునిచ్చారు. సోమవారం కలెక్టరేట్‌లో త్వరలో ప్రారంభం కానున్న న్యూ ఇండియా లిటరసీ కార్యక్రమంలో ఆయన సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. జిల్లాలో నిరక్షరాస్యులను అక్షరాస్యులుగా తీర్చిదిద్దాలన్నారు. 15 ఏళ్లు నిండిన ప్రతి ఒక్కరికి చదవడం, రాయడం రావాలన్నారు. గతంలో ఉన్న అక్షరాస్యత కంటే మెరుగైన అక్షరాస్యత నమోదు చేసి రాష్ట్రంలో జిల్లాను ప్రథమ స్థానంలో నిలపాలన్నారు. ఇందు కోసం గ్రామస్థాయిలో ప్రత్యేక టీంలను ఏర్పాటు చేయాలని సూచించారు. గ్రామ మహిళా సంఘాలను భాగస్వామ్యం చేసుకోవాలన్నారు.

పాఠశాలలను పరిశుభ్రంగా ఉంచాలి..

రేపటి నుంచి పాఠశాలలు పునః ప్రారంభం కానున్న నేపథ్యంలో పాఠశాలలను పరిశుభ్రంగా ఉంచాలని, అన్ని పనులు పూర్తి చేయాలన్నారు. పాఠశాలల్లో నిల్వ ఉన్న స్టాక్‌ను చెక్ చేసుకోవాలని, పాడైపోయినటువంటి స్టాక్‌లు ఏమైనా ఉంటే తీసివేయాలన్నారు. మధ్యాహ్న భోజన కార్యక్రమానికి ఏర్పాట్లు చేసుకోవాలన్నారు. 12న విద్యార్థులకు మధ్యాహ్న భోజనం అందించాలన్నారు. విద్యార్థులకు పుస్తకాలు, నోట్‌బుక్స్ త్వరగా అందజేయాలని సూచించారు. తాగు నీరు, విద్యుత్ సమస్య లేకుండా చూడలన్నారు. అంగన్‌వాడీ పాఠశాల పూర్తయిన విద్యార్థులను ప్రాథమిక పాఠశాలలో చేర్పించాలని సూచించారు. జిల్లాలో ఎరువుల కొరత లేదని, అన్ని రకాల విత్తనాలు అందుబాటులో ఉన్నాయన్నారు. కార్యక్రమంలో అదనపు కలెక్టర్ వెంకటేశ్వర్లు, డీఈవో రాధాకిషన్, జిల్లా అధికారులు తదితరులు పాల్గొన్నారు.

ఫర్టిలైజర్ దుకాణాల్లో తనిఖీ



కంగ్టిలో ఎరువుల దుకాణంలో రికార్డులను పరిశీలిస్తున్న అధికారులు

కంగ్టి, జూన్ 10: మండల కేంద్రమైన కంగ్టిలోని ఫర్టిలైజర్ దుకాణాలను సోమవారం వ్యవసాయ, పోలీస్ శాఖ అధికారులు సంయుక్తంగా తనిఖీ చేశారు. అధిక ధరలకు ఎరువులు, విత్తనాలు విక్రయిస్తే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. స్టాకు వివరాలతో పాటు రికార్డులు తనిఖీ చేశారు. కార్యక్రమంలో మండల వ్యవసాయాధికారి ప్రవీణ్‌చారి, ఏఎస్ఐ నారాయణ, తదితరులు పాల్గొన్నారు.

కోహీర్‌లో..

కోహీర్ జూన్ 10: మండల కేంద్రమైన కోహీర్ తోపాటు మండల పరిధిలోని పోతిరెడ్డిపల్లి, కవేలి చౌరస్తాలో గల పలు ఫర్టిలైజర్ దుకాణాలను జహీరాబాద్ ఏడీఏ బిక్షపతి తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఏడీఏ మాట్లాడుతూ ఫర్టిలైజర్ దుకాణదారులు నకిలీ ఎరువులు, విత్తనాలు విక్రయిస్తే కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. రైతులకు నాణ్యమైన విత్తనాలను, ఎరువులను మందులను ఎమ్మార్పీకే ధరలకే విక్రయించాలన్నారు. ఎక్కడైనా నకిలీ ఎరువులు విత్తనాలు విక్రయిస్తే ఆ మేరకు సమాచారాన్ని సంబంధిత వ్యవసాయాధికారులకు సమాచారం అందించాలన్నారు.

కౌన్సిల్ సమావేశం రసాభాస

● అధికారుల తీరుపై మండిపడ్డ కౌన్సిలర్లు

● కమిషనర్ ప్రసన్నరాణిపై ఆగ్రహం

● స్టేజీపై నుంచి దిగి అధికారులతో కలిసి స్టేజీ కింద కూర్చోవాలంటూ ఒత్తిడి



స్టేజీ కింద కూర్చున్న మున్సిపల్ కమిషనర్

సిద్దిపేట టౌన్, జూన్10: సిద్దిపేట పట్టణంలోని మున్సిపల్ కార్యాలయంలో సోమవారం జరిగిన కౌన్సిల్ సమావేశం వాడీవేడిగా కొనసాగింది. సమావేశం ప్రారంభం కాగానే మున్సిపల్ కమిషనర్ ప్రసన్నరాణి స్టేజీపై నుంచి కిందికి దిగాలంటూ, అధికారులతో పాటు స్టేజీ కింద కూర్చోవాలంటూ బీఆర్ఎస్ కౌన్సిలర్లు పట్టుబట్టారు. దీంతో కమిషనర్ ప్రసన్నరాణి అధికారులతో కలిసి స్టేజీ కింద కూర్చున్నారు. ఈ సందర్భంగా పలువురు సభ్యులు మాట్లాడుతూ.. కౌన్సిలర్లు వార్డు సమస్యలపై కమిషనర్ దృష్టికి తీసుకువెళ్తే పట్టించుకోవడం లేదని, కనీసం తమకు మర్యాద కూడా ఇవ్వడంలేదని మండిపడ్డారు. మున్సిపల్ కార్యాలయానికి డిప్యూటేషన్‌పై వచ్చిన అధికారులను వారివారి స్థానాలకు తిరిగి పంపించాలని పట్టుబట్టారు.

తప్పు చేస్తే ఎవరినీ ఉపేక్షించం

మున్సిపల్ అధికారులు, సిబ్బంది ఎవరు తప్పు చేసిన ఉపేక్షించేది లేదని మున్సిపల్ చెర్‌పర్సన్ కడవేరుగు మంజుల రాజనర్సు మండిపడ్డారు. కౌన్సిల్ సమావేశంలో ఆమె మాట్లాడుతూ.. పాలకవర్గం సభ్యులు, అధికారులు సమన్వయంతో పనిచేసి సిద్దిపేట పట్టణానికి మంచి పేరు తీసుకురావాలని సూచించారు. సమావేశంలో భాగంగా అజెండాలో పొందుపరిచిన అంశాలను సభ్యులు ఆమోదించారు. సమావేశంలో మున్సిపల్ అదనపు కమిషనర్ మల్లికార్జున్, పట్టణ కౌన్సిలర్లు, కో ఆప్షన్ సభ్యులు, మున్సిపల్ అధికారులు, విద్యుత్‌శాఖ అధికారులు, పబ్లిక్ హెల్త్ అధికారులు పాల్గొన్నారు.

సీడీఎంఏకు ఫిర్యాదు

సిద్దిపేట పట్టణంలోని మున్సిపల్ కార్యాలయంలో శనివారం నిర్వహించిన కౌన్సిల్ సమావేశంలో మహిళ అని చూడకుండా తనను తీవ్రంగా అవమానించారంటూ, సిద్దిపేట మున్సిపల్ కమిషనర్ ప్రసన్నరాణి హైదరాబాద్‌లోని కమిషనర్ అండ్ డైరక్టరేట్ మున్సిపల్ అడ్మినిస్ట్రేషన్ (సీడీఎంఏ)కు ఫిర్యాదు చేసినట్లు తెలిపారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ కౌన్సిల్ సభ్యులు తాను ఏ తప్పు చేయకుండానే స్టేజీపై కూర్చున్న తనను కావాలనే కింద కూర్చోమని చెప్పారని ఆవేదన వ్యక్తం చేశారు.

కమిషనర్‌ను అవమానించారు : అత్తుఇమామ్

సిద్దిపేట టౌన్, జూన్10: మున్సిపల్ సమావేశంలో స్టేజ్ పైన ఉండాల్సిన మునిసిపల్ కమిషనర్ ప్రసన్నరాణిని మునిసిపల్ చైర్‌పర్సన్ మంజుల రాజనర్సు స్టేజీ కింద కూర్చోబెట్టి అవమానించారని కాంగ్రెస్ సిద్దిపేట పట్టణ అధ్యక్షుడు అత్తుఇమామ్ మండిపడ్డారు. శనివారం సిద్దిపేటలో ఆయన మాట్లాడుతూ.. చైర్‌పర్సన్ మంజుల భర్త రాజనర్సు కనుసన్నల్లో పనిచేస్తున్న కొందరు కౌన్సిలర్లు కమిషనర్ ప్రసన్నరాణి పట్ల అమర్యాదగా ప్రవర్తించి, సభ్య సమాజం తలదించుకునేలా వ్యవహరించారని మండిపడ్డారు. త్వరలోనే తమతో టచ్‌లో ఉన్న మున్సిపల్ కౌన్సిలర్లతో సంప్రదింపులు జరిపి అవిశ్వాస తీర్మానం ప్రవేశపెడతామని హెచ్చరించారు. కార్యక్రమంలో నాయకులు గ్యాదరి మధు, గయాజుద్దీన్, రాశాద్, నజ్జు ఫయాజ్, అభినవ్‌రెడ్డి, రవితేజ తదితరులు పాల్గొన్నారు.

ఏడుపాయల ఈవోగా వినోద్‌రెడ్డి



ఏడుపాయల నూతన ఈవో వినోద్‌రెడ్డి

పాపన్నపేట జూన్ 10: ప్రసిద్ధ పుణ్యక్షేత్రం ఏడుపాయల వనదుర్గామాత ఆలయ ఈవోగా దేవాదాయ, ధర్మాదాయ శాఖ డిప్యూటీ కమిషనర్ వినోద్‌రెడ్డి సోమవారం బాధ్యతలు స్వీకరించారు. ప్రస్తుతం డిప్యూటీ కమిషనర్‌గా బాధ్యతలు నిర్వర్తిస్తున్న ఆయన వనదుర్గా ఆలయ ఈవోగా నియమితులయ్యారు. ఆలయ సిబ్బందిని అడిగి ఆయన ఆలయ వివరాలు తెలుసుకున్నారు. అనంతరం మాట్లాడుతూ అమ్మవారి ఆశీస్సులతో ఆలయాన్ని మరింత అభివృద్ధి చేసేందుకు కృషిచేస్తానని చెప్పారు. భక్తులకు అందుబాటులోఉంటూ సమస్యలను పరిష్కరిస్తానని తెలిపారు.

ఎల్‌సీ ఇవ్వాలని విద్యుత్ శాఖ అధికారులకు వినతి

చేర్యాల, జూన్ 10: జనగామ-సిద్దిపేట జాతీయ రహదారి విస్తరణలో భాగంగా చేర్యాల పట్టణంలో చేపట్టిన డ్రైనేజీ కాలువ పనుల పూర్తికి విద్యుత్ స్తంభాలు అడ్డుగా ఉన్నాయని, స్తంభాలను సవరించేందుకు విద్యుత్ సరఫరా నిలిపి వేయడానికి ఎల్‌సీ ఇవ్వాలని కోరుతూ, చేర్యాల మునిసిపల్ చైర్‌పర్సన్ అంకుగారి స్వరూపారాణి, వైస్ చైర్మన్ నిమ్మ రాజీవ్‌రెడ్డి తదితరులు విద్యుత్‌శాఖ అధికారులకు వినతిపత్రం అందించారు. ఈ మేరకు సోమవారం కౌన్సిలర్లు మంగోలు చంటి, పచ్చిమడ్ల సతీశ్‌లతో కలిసి స్థానిక ఏడీఈ కార్యాలయానికి వెళ్లగా, ఏడీఈ రత్నవీరాచారి అందుబాటులో లేక పోవడంతో టౌన్ ఏఈ తాబ్రీజ్‌కు వినతిపత్రం అందజేశారు. ఈనెల 11 నుంచి 30వ తేది వరకు ఉదయం 8 నుంచి మధ్యాహ్నం 11గంటల వరకు ఎల్‌సీతో విద్యుత్ సరఫరా నిలిపివేయాలని కోరారు. దీంతో ఆయన ఉన్నతాధికారుల దృష్టికి తీసుకువెళతానని పేర్కొనగా, హుస్నాబాద్ డీఈని కలిసి వినతిపత్రం అందించనున్నట్లు తెలిపారు.

ప్రభుత్వ పాఠశాలల బలోపేతానికి కృషి

● జడ్పీ చైర్‌పర్సన్ రోజా రాధాకృష్ణశర్మ



మాట్లాడుతున్న జడ్పీ చైర్‌పర్సన్



సమావేశానికి హాజరైన అధికారులు

సిద్దిపేట రూరల్,జూన్ 10: ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులను చేర్పించి ప్రభుత్వ పాఠశాలలను బలోపేతం చేసేందుకు అధికారులు, ప్రజాపతినిధులు కృషి చేయాలని జడ్పీ చైర్ పర్సన్ రోజా రాధాకృష్ణశర్మ పేర్కొన్నారు. సిదిపేట రూరల్ మండల సర్వసభ్య సమావేశం సోమావారం మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీపీ శ్రీదేవి రాంచందర్‌రావు అధ్యక్షతన నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. ప్రభుత్వ పాఠశాలల్లో అన్ని మౌలిక వసతులు, ఉత్తమ ఉపాధ్యాయులతో విద్యా బోధన జరుగుతున్నదని తెలిపారు. ప్రభుత్వ ఆస్పత్రుల్లో ప్రసవాలు జరిగేలా అవగహన కల్పించాలని, ప్రైవేట్ ఆస్పత్రులను ఆశ్రయించి లక్షల్లో డబ్బులు ఖర్చు చేసి సామాన్యులు ఆర్థికంగా నష్టపోతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఎంపీటీసీలు, జడ్పీటీసీలు ఐదేళ్ల పదవీకాలంలో మాజీ మంత్రి సహకారంతో సిద్దిపేట జిల్లాను అన్నిరంగాల్లో ఆదర్శంగా నిలిపామని, భవిష్యత్తులో వచ్చే అవకాశాలను సద్వినియోగం చేసుకుని మరింత ఆదర్శంగా నిలుద్దామని పెర్కోన్నారు. మూడు నెలలకు ఒకసారి నిర్వహించే సమావేశానికి అధికారులు సమయానికి హాజరు కాకపోవడం పట్ల ఆగ్రహంవ్యక్తం చేశారు. ఈ సమావేశంలో ఎంపీడీవో రాఘవేందర్‌రెడ్డి, మండల వ్యవసాయ అధికారి పరశురాంరెడ్డి, ఎంపీపీ ఉపాధ్యక్షుడు యాదగిరి, అయాశాఖాల అధికారులు ,సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

మూగయువతిపై అత్యాచారయత్నం

చేర్యాల జూన్ 10: చేర్యాల మండలంలోని ఓ గ్రామానికి చెందిన మూగ యువతి పై ఆదే గ్రామానికి చెందిన డప్పు రాజేందర్ అత్యాచారయత్నానికి పాల్పడిన సంఘటన ఆలస్యంగా వెలుగుచూసింది. బాలిక తల్లిదండ్రులు గ్రామ శివారులోని మరో శివారు కాలనీలో నిద్రిస్తుండగా, అమ్మమ్మ ఇంట్లో మూగ యువతి ఉంది. రెండురోజులక్రితం సదరు యువతి రాత్రి కాలకృత్యాలు తీర్చుకోవడానికి వెళ్లగా, డప్పు రాజేందర్ చేయిపట్టి లాగడాన్ని ఆమె చెల్లెలు, బంధువుల అమ్మాయి గమనించడంతో అక్కడి నుంచి అతడు పరారయ్యాడు. ఈవిషయం బయటకు పొక్కడంతో సోమవారం పలువురు పెద్దలు ఇరువర్గాల వారితో గ్రామశివారులో పంచాయితీ పెట్టి, రాజేందర్‌కు జరిమానా విధించేందుకు నిర్ణయించారు. అదే సమయంలో పోలీసులు అక్కడికి చేరుకోవడాన్ని గమనించి వెళ్లిపోయారు. ఈ విషయమై పోలీసులు గ్రామంలో ఆరా తీయడంతో అసలు విషయం బయటపడింది. దీంతో యువతి తల్లిదండ్రులను పోలీస్‌స్టేషన్‌కు రావాలని సూచించారు. దీంతో యువతితో కలిసి తల్లిదండ్రులు స్టేషన్‌కు చేరుకుని వివరాలు తెలిపారు. అనంతరం వారు ఇచ్చిన ఫిర్యాదు మేరకు రాజేందర్‌పై కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ దామోదర్ తెలిపారు.

పెండింగ్ రుణాలను 15 రోజుల్లోగా మంజూరు చేయాలి

సిద్దిపేట కలెక్టర్ మను చౌదరి



జిల్లా వార్షిక క్రెడిట్ ప్లాన్‌ను ప్రారంభిస్తున్న కలెక్టర్ మను చౌదరి

సిద్దిపేట అగ్రికల్చర్, జూన్ 10: బ్యాంకులను సమన్వయం చేసి పెండింగ్‌లో ఉన్న వివిధ రుణాలను 15 రోజుల్లోగా మంజూరు చేయాలని కలెక్టర్ ఆదేశించారు. సోమవారం జిల్లా సమీకృత కార్యాలయాల సముదాయం సమావేశం మందిరంలో 2024 మార్చి త్రైమాసికానికి సంబంధించి డీసీసీ సమావేశం లీడ్ బ్యాంకు ఆధ్వర్యంలో జిల్లా కలెక్టర్ మను చౌదరి అధ్యక్షతన నిర్వహించారు. ఈ సమావేశంలో ఆర్బీఐ నాబార్డ్, లీడ్ బ్యాంక్, ఇతర శాఖలకు చెందిన ఇతర ప్రముఖులు 2024-25 సంవత్సరానికి రూ .7218 కోట్ల జిల్లా వార్షిక క్రెడిట్ ప్లాన్‌ను ప్రారంభించారు. ఆర్‌బీఐ ఫైనాన్షియల్ ఇన్‌క్లూజన్ ప్లాన్ ఆర్థిక అక్షరాస్యత అమలు ప్రణాళికపై చర్చించారు. కార్యక్రమంలో ఆర్‌హెచ్ వికాస్, ఆర్‌ఎం మాధవి, బాలనాగు, నాబార్డ్ డీడీఎం, ఆర్‌బీఐ ఎల్‌డీవో తాన్య, కంట్రోలింగ్ అధికారులు, జిల్లా అధికారులు పాల్గొన్నారు.

రెడ్డి కార్పొరేషన్ చైర్మన్‌గా వెంకటేశ్వరెడ్డిని నియమించాలి

దుబ్బాక,జూన్ 10: రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించిన రెడ్డి కార్పొరేషన్‌కు చైర్మన్‌గా బద్దూరి వెంకటేశ్వరెడ్డిని నియమించాలని జిల్లా రెడ్డి సంఘం అధక్షుడు కోమటిరెడ్డి శ్రీనివాస్‌రెడ్డి విజ్ఞప్తి చేశారు. సోమవారం దుబ్బాకలో ఆయన మాట్లాడారు. రెడ్డి సంక్షేమానికి ప్రభుత్వం కృషిచేయాలని, అందులో భాగంగా రెడ్డి కర్పొరేషన్ చైర్మన్‌గా బద్దూరి వెంకటేశ్వర్‌రెడ్డిని ప్రకటించాలని కోరారు.

ప్రజాసేవే ఎల్లాగౌడ్ ట్రస్ట్ ధ్యేయం

జగదేవ్‌పూర్, జూన్ 10: గ్రామంలో ప్రజాసేవ చేయడమే ఎల్లాగౌడ్ ట్రస్ట్ ధ్యేయమని ఎల్లాగౌడ్ ట్రస్ట్ చైర్మన్ రంగ వెంకట్‌గౌడ్ అన్నారు. మండలంలోని తిగుల్‌లో ట్రస్ట్ ఆధ్వర్యంలో గ్రామంలోని అంగన్‌వాడీ కేంద్రాలకు నాలుగు సీలింగ్ ఫ్యాన్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో సభ్యులు నర్సింహులు గౌడ్, దామోదర్‌రెడ్డి, చంద్రశేఖర్‌రెడ్డి, గిరిధర్‌రావు, వెంకటేశం, దుర్గప్రసాద్, సత్యం, కరుణాకర్, ఆయాలు పాల్గొన్నారు.

కాంగ్రెస్ నాయకురాలి పాడె మోసిన జడ్పీటీసీ

మద్దూరు, జూన్ 10: మండలంలోని గాగిళ్లాపూర్‌లో కాంగ్రెస్ సీనియర్ నాయకురాలు సుంకోజు శ్రీదేవి ఆదివారం రాత్రి గుండెపోటుతో మృతిచెందారు. విషయం తెలుసుకున్న జడ్పీటీసీ గిరి కొండల్‌రెడ్డి సోమవారం వారి కుటుంబసభ్యులను పరామర్శించారు. అనంతరం అంత్యక్రియల్లో పాల్గొని పాడె మోసి కుటుంబానికి ధైర్యం చెప్పారు. ఈ సందర్భంగా శ్రీదేవి పార్టీకి చేసిన సేవల్ని గుర్తు చేశారు. ఆయనవెంట కాంగ్రెస్ మండల అధ్యక్షుడు మేక మల్లేశం, మాజీ సర్పంచ్ శివయ్యగౌడ్ తదితరులు ఉన్నారు.

వీడియో కాన్ఫరెన్స్‌ను రైతులు సద్వినియోగించుకోవాలి

మర్కుక్, జూన్ 10: మర్కుక్ మండలం రైతు వేదికలో నేడు ఉదయం 9 గంటల నుంచి 10:30 గంటల వరకు రైతుసాధికార అంశాలపై, రైతులకు వీడియో కాన్ఫరెన్స్ ద్వారా శాస్త్రవేత్తలతో అవగాహన కల్పిస్తామని మండల వ్యవసాయాధికారి టి. నాగేందర్‌రెడ్డి తెలిపారు. తమ కార్యాలయంలో సోమవారం విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రైతులు అధిక సంఖ్యలో పాల్గొని తమ సందేహాలను నివృత్తి చేసుకోవాలని సూచించారు.

నేడు విద్యుత్ అంతరాయం

గజ్వేల్, జూన్ 10: నేడు గజ్వేల్ పట్టణంలోని పలు ప్రాంతాల్లో విద్యుత్ సరఫరాకు అంతరాయం ఉంటుందని విద్యుత్ శాఖ ఏఈ మారుతి తెలిపారు. చెట్ల కొమ్మలను తొలగించనున్నామని, పట్టణంలోని తూప్రాన్ రోడ్డు, తిరుమల థియేటర్ ఏరియా, సంగాపూర్ రోడ్డులో ఉదయం 6గంటల నుంచి 8.45గంటల వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందన్నారు. చేగుంట రోడ్డు, సంగుపల్లి, తూప్రాన్ రోడ్డులో ఉదయం 10గంటల నుంచి 11.30గంటల వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని విద్యుత్ వినియోగదారులు ఇది గమనించి సహకరించాలని కోరారు.

రెండు రోజుల్లో యూనిఫామ్స్ పంపిణీ

● ఏపీఎం బ్రహ్మచారి



స్కూల్ యూనిఫామ్స్ అందజేస్తున్న ఏపీఎం

మర్కుక్, జూన్ 10: మరో రెండు రోజుల్లో విద్యార్థులకు స్కూల్ యూనిఫామ్స్ పంపిణీ చేస్తామని ఏపీఎం బ్రహ్మచారి అన్నారు. మండలంలోని అంగడి కిష్టాపూర్ ప్రాథమికోన్నత పాఠశాలలో సోమవారం సెర్ప్ ఆధ్వర్యంలో ఏపీఎం బ్రహ్మచారి, పాఠశాల ప్రధానోపాధ్యాయుడు ఓంకార్‌కు స్కూల్ యూనిఫామ్స్‌ను అందజేశారు. విద్యార్థులకు అనుకున్న సమయానికి స్కూల్ యూనిఫామ్స్ అందుతాయన్నారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు రామకృష్ణారెడ్డి, చిన్నికృష్ణ, సీసీలు కవిత, హరిచంద్, పాతూరు సీఏ కృష్ణమూర్తి, విద్యార్థుల తల్లిదండ్రులు ఉన్నారు.

ఎరువుల దుకాణాల్లో అధికారుల తనిఖీ

చేర్యాల, జూన్ 10: చేర్యాల పట్టణంలోని పలు ఫర్టిలైజర్స్, ఎరువుల దుకాణాల్లో సోమవారం సిద్దిపేట జిల్లా టాస్క్‌ఫోర్స్ అధికారులు తనిఖీ చేపట్టారు. ఈ సందర్భంగా ఆయా దుకాణాల రికార్డులు, లైసెన్స్, స్టాకు, గోదాములను పరిశీలించారు. లూజు, నకిలీ విత్తనాలు, ఎరువులు విక్రయిస్తే చట్టపరచర్యలు తప్పవని హెచ్చరించారు. ఈ తనిఖీల్లో చేర్యాల ఏడీఏ రాధిక, ఏవో అఫ్రోజ్ పాల్గొన్నారు.

తండ్రికి తలకొరివి పెట్టిన కూతురు



అంతిమయాత్రలో తలకొరివి పట్టిన కూతురు

చేర్యాల, జూన్ 10: తండ్రికి కూతురు తలకొరివి పట్టి అంత్యక్రియలు నిర్వహించిన సంఘటన సోమవారం చేర్యాల మండలం ముస్త్యాల గ్రామంలో జరిగింది. గ్రామానికి చెందిన మేరిండ్ల శ్రీనివాస్ (44) అనారోగ్యంతో ఆదివారం రాత్రి మృతి చెందాడు. అతడికి ముగ్గురు కూతుళ్లు సంతానం. పెద్దకూతురు తలకొరివి పట్టి పున్నామనరకాన్ని దాటించింది. మృతుడు మేరిండ్ల శ్రీనివాస్ బీఆర్ఎస్ నాయకుడిగా, కల్లుగీత కార్మికసంఘం నాయకుడిగా, రెవెన్యూ డివిజన్ జేఏసీ నాయకుడిగా వ్యవహరిస్తున్నాడు. ఆయన మృతిపట్ల సర్పంచుల ఫోరం మాజీ అధ్యక్షుడు పెడుతల ఎల్లారెడ్డి, సీపీఐ నాయకులు అందె అశోక్, ఈరు భూమయ్య, కల్లుగీత కార్మిక సంఘం రాష్ట్ర అధ్యక్షుడు యం.వి.రమణ, నాయకులు శోభన్, కోహెడ కొమురయ్య, బండకింది అరుణ్, బాల్నె వెంకటమల్లయ్య, వెంకట నర్సయ్య సంతాపం వ్యక్తం చేశారు.

గ్రామ కమిటీ అధ్యక్ష పదవికి రాజీనామా

ములుగు, జూన్ 10: ఇటీవల జరిగిన అసెంబ్లీ, పార్లమెంట్ ఎన్నికల్లో ములుగు మండలం నాగిరె డ్డిపల్లిలో బీఆర్ఎస్ పార్టీకి తక్కువ ఓట్లు రావడంతో, గ్రామ కమిటీ అధ్యక్ష పదవికి రాజీనామా చేస్తున్నట్లు బాల్‌రెడ్డి తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. గ్రామంలో ఓట్లు తగ్గినందుకు తానే బాధ్యత వహిస్తూ, రాజీనామా పత్రాన్ని పార్టీ మండల అధ్యక్షుడు జహంగీర్‌కు అందజేశారు.

మంత్రిని కలిసిన డీసీసీబీ చైర్మన్

కొండపాక, జూన్ 10: రాష్ట్ర వ్యవసాయశాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావును ఉమ్మడి మెదక్ జిల్లా డీసీసీబీ చైర్మన్ చిట్టి దేవేందర్‌రెడ్డి సోమవారం మర్యాదపూర్వకంగా కలిశారు. డీసీసీబీ ఆధ్వర్యంలో రైతులకు అందిస్తున్న సేవలను ఈ సందర్భంగా మంత్రికి వివరించారు.

సర్వసభ్య సమావేశం వాయిదా

మిరుదొడ్డి,జూన్10: మిరుదొడ్డి కేంద్రంలోని మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో సోమవారం ఏర్పాటు చేసిన సర్వసభ్యసమావేశాన్ని వాయిదా వేసినట్టు ఎంపీడీవో గణేష్‌రెడ్డి తెలిపారు. స్థానిక కార్యాలయంలో పదిగంటలకు ప్రారంభం కావాల్సిన సర్వసభ్యసమావేశానికి ఎంపీటీసీలు హాజరుకాలేదని, 12 గంటల వరకు వేచి చూసినా ఎంపీటీసీలు రాకపోవడంతో వాయిదా వేసినట్టు ఆయన వెల్లడించారు.

ప్రభుత్వ పాఠశాలల్లోనే గుణాత్మక విద్య

● టీయూడబ్ల్యూజే రాష్ట్ర అధ్యక్షుడు విరహత్ అలీ



సిద్దిపేట రూరల్: చింతమడకలో బడిబాటలో భాగంగా ర్యాలీ నిర్వహిస్తున్న ఉపాధ్యాయులు

సిద్దిపేట క్రైం, జూన్ 10: ప్రభుత్వ పాఠశాలల్లోనే గుణాత్మకమైన విద్య అందుతున్నదని టీయూడబ్ల్యూజే రాష్ట్ర అధ్యక్షుడు విరహత్ అలీ పేర్కొన్నారు. సిద్దిపేట జిల్లాలో అత్యధికంగా విద్యార్థులు ఉన్న ఇందిరానగర్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలను సోమవారం ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. ప్రభుత్వ పాఠశాలల్లో అమ్మ ఆదర్శ కమిటీ ఆధ్వర్యంలో మౌలిక వసతుల కల్పనకు రాష్ట్ర ప్రభుత్వం కృషి చేస్తున్నదన్నారు. ఈ సందర్భంగా సిద్దిపేట జిల్లా విద్యాశాఖ అధికారి శ్రీనివాస్‌రెడ్డి సమక్షంలో పీఆర్‌టీయూ జిల్లా శాఖ, ఇందిరానగర్ పాఠశాల బృందం, పీఆర్‌టీయూ సిద్దిపేట జిల్లా శాఖ అధ్యక్షుడు ఆదరాసుపల్లి శశిధర్ శర్మ ,జిల్లా ప్రధాన కార్యదర్శి మల్లు గారి ఇంద్రసేనారెడ్డి, సెక్టోరియల్ అధికారి రామస్వామి, విరహత్ అలీని శాలువాతో సన్మానించారు. కార్యక్రమంలో టీయూడబ్ల్యూజే సిద్దిపేట జిల్లా అధ్యక్షుడు కె.రంగాచారి, ఇందిరానగర్ పాఠశాల సీనియర్ ఉపాధ్యాయురాలు బి.నీరజ, పీఆర్‌టీయూ రాష్ట్ర అసోసియేట్ అధ్యక్షుడు పీ.రామకృష్ణారెడ్డి, పీఆర్‌టీయూ సీనియర్ నాయకులు ఆస దశరథం తదితరులు పాల్గొన్నారు.

● సిద్దిపేట రూరల్: బడిబాట ద్వారా రాష్ట్ర ప్రభుత్వ ప్రభుత్వ పాఠశాలకు గుర్తింపు తీసుకువచ్చిందని సిద్దిపేట రూరల్ మండలం చింతమడక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల కాంప్లెక్స్ ప్రధానోపాధ్యాయుడు రాజిరెడ్డి అన్నారు. సోమవారం గ్రామంలో బడిబాట కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రాష్ట్ర ప్రభుత్వం బడిబాట ద్వారా పేద పిల్లల్ని గుర్తించి. ప్రభుత్వ పాఠశాలలో చేర్పించాలని దృఢ సంకల్పంతో ప్రారంభించిందన్నారు. కార్యక్రమంలో ప్రాథమిక పాఠశాల ప్రధానోపాధ్యాయులు ఎల్లం, అడ్వకేట్ అరవింద్, ఉపాధ్యాయులు భైరవరెడ్డి, శ్రీశైలం, గోవర్ధన్ రెడ్డి, అజిత్, బాలరాజు తదితరులు పాల్గొన్నారు.

సీఎంతో విద్యార్థుల ముఖాముఖి

నంగునూరు, జూన్ 10: ఇటీవల వెలువడిని పదో తరగతి ఫలితాల్లో 10 జీపీఏ సాధించిన నర్మెట్ట ఉన్నత పాఠశాల విద్యార్థులు సోమవారం హైదరాబాద్‌లోని హరిహర కళాభవన్‌లో, వందేమాతరం ఫౌండేషన్ ఆధ్వర్యంలో సీఎం రేవంత్‌రెడ్డితో నిర్వహించిన ముఖాముఖి కార్యక్రమంలో పాల్గొన్నారు. నర్మెట పాఠశాలకు చెందిన విద్యార్థులు గట్టు హారిక, పిల్లి శివకుమార్, రేకులపల్లి శృతి, కొలుపుల వైష్ణవి, బందారం వర్ష, సల్లారం దుర్గాప్రసాద్, గెల్లు పవన్, కలకుంట్ల శ్రీనివాస్‌లతో పాటు వారి తల్లిదండ్రులు పాల్గొన్నారు. సీఎంతో ముఖాముఖిలో పాల్గొన్న విద్యార్థులను పాఠశాల ఉపాధ్యాయులు అభినందించారు.

'నిర్మాణాలను పూర్తి చేయాలి'



వినతిపత్రం సమర్పిస్తున్న బీఆర్ఎస్ నాయకులు

హుస్నాబాద్, జూన్ 10: హుస్నాబాద్ పట్టణంలో పెండింగ్‌లో ఉన్న డబుల్ బెడ్‌రూమ్ ఇళ్లను పూర్తి చేసి లబ్ధిదారులకు అందించాలని సోమవారం హుస్నాబాద్ రెవెన్యూ అధికారులకు బీఆర్ఎస్ ఆధ్వర్యంలో వినతిపత్రం సమర్పించారు. పట్టణంలో ఇళ్లులేని నిరుపేదలకు డబుల్ బెడ్ రూమ్ ఇళ్లు కేటాయించారని, కాని కొన్ని ఇళ్ల నిర్మాణం ఇప్పటికీ పూర్తి కాలేదని తెలిపారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు అయిలేని మల్లికార్జున్‌రెడ్డి, బొజ్జ హరీశ్, బత్తుల జీవన్, కందుకూరి సతీష్, జేరిపోతుల సునిత, పున్నలక్ష్మి తదితరులున్నారు.

మిషన్ భగీరథ నల్లా కనెక్షన్లపై సర్వే



గాగిళ్లాపూర్‌లో ఇంటింటి సర్వే చేపట్టిన ఎంపీవో

మద్దూరు, జూన్ 10: మద్దూరు ఉమ్మడి మండలంలోని అన్ని గ్రామాల్లో మిషన్‌భగీరథ నల్లా కనెక్షన్లపై ఇంటింటి సర్వే నిర్వహిస్తున్నట్లు ఎంపీవో ఖాజామొయినుద్దీన్ తెలిపారు. సోమవారం మద్దూరు మండలంలోని గాగిళ్లాపూర్, నర్సాయపల్లి, మద్దూరు గ్రామాల్లో సర్వే చేపట్టినట్లు వెల్లడించారు. ఈ సందర్భంగా ఎంపీవో మాట్లాడుతూ.. 23 గ్రామాల్లో సర్వే చేసేందుకు 56 మందిని నియమించినట్లు తెలిపారు. ఒక్కో వ్యక్తి 250 ఇళ్లను సర్వే చేస్తూ, లాగిన్‌లో ఎంటర్ చేయాలని సూచించినట్లు తెలిపారు. కార్యక్రమంలో పంచాయతీ సెక్రటరీ వెంకటేశ్వర్లు ఉన్నారు.

ఢిల్లీలో కేంద్ర మంత్రి బండి సంజయ్‌ని కలిసిన బీజేపీ నాయకులు

కొండపాక, జూన్ 10 : కేంద్ర మంత్రి బండి సంజయ్‌ను పలువురు బీజేపీ నాయకులు ఢిల్లీలో కలిసి శుభాకాంక్షలు తెలిపారు. కేంద్ర ప్రభుత్వం మంత్రివర్గ ప్రమాణస్వీకారోత్సవానికి పలువురు బీజేపీ నాయకులు ఢిల్లీకి తరలివెళ్లారు. సోమవారం మంత్రి బండి సంజయ్‌ని బీజేపీ ఓబీసీ విభాగం రాష్ట్ర ఉపాధ్యక్షుడు భైరి శంకర్ ముదిరాజ్ కలిసి శుభాకాంక్షలు తెలిపారు. అలాగే హైదరాబాద్ ఎంపీ అభ్యర్థిగా పోటీ చేసిన మాధవిలతను బీజేపీ నాయకులు భైరి శంకర్ ముదిరాజ్, నలగామ శ్రీనివాస్‌లు కలిశారు.

నీట్, యూజీ ఫలితాల అవతవకలపై విచారణ జరిపించాలి

● ఎఐవైఎఫ్ జిల్లా అధ్యక్షుడు రాజ్‌కుమార్

హుస్నాబాద్, జూన్ 10: నీట్ యూజీ ఫలితాల అవకతవకలపై సుప్రీంకోర్టు సిట్టింగ్ జడ్జితో విచారణ జరిపించాలని ఎఐవైఎఫ్ జిల్లా అధ్యక్షుడు జనగామ రాజ్‌కుమార్ ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. ఇంటర్మీడియేట్ మార్కుల ఆధారంగా వైద్య కళాశాలల్లో సీట్లను కేటాయించాలన్నారు. హర్యానాలోని ఓ పరీక్ష కేంద్రంలో ఒకే గదిలో పరీక్ష రాసిన ఎనిమిది మంది విద్యార్థులకు 720 మార్కులకు 720 మార్కులు రావడం ఏంటని, ప్రశ్నపత్రం లీక్ అయ్యిందా, మాస్ కాపీయింగ్ జరిగిందా అనే అనుమానాలు వ్యక్తమవుతున్నాయన్నారు.

'ఓటును డబ్బు, మద్యానికి అమ్ముకున్నారు'



మిరుదొడ్డిలో మాట్లాడుతున్న డీఎస్‌పీ నాయకులు

మిరుదొడ్డి, జూన్ 10: ఇటీవల జరిగిన లోక్‌సభ ఎన్నికల్లో తమ ఓటు హక్కును డబ్బులకు, మద్యానికి అమ్ముకుని, కొందరు ప్రజాస్వామ్యాన్ని కూని చేశారని డీఎస్‌పీ రాష్ట్ర కార్యదర్శి కర్రోల్ల రవిబాబు ఆవేదన వ్యక్తం చేశారు. సోమవారం మిరుదొడ్డిలో ఆయన విలేకరులతో మాట్లాడారు. కులమతాలను రెచ్చగొట్టి కేంద్రంలో ఎన్‌డీఏ అధికారంలోకి వచ్చిందని విమర్శించారు. ఆయనవెంట ఎమ్మెల్యేగా పోటీచేసిన డీఎస్‌పీ అభ్యర్థులు ప్రసన్న, పరమేశ్వరీ, డీబీ.రాజు, నాయకులు చందు, అనిల్, కనకమల్లేశం, మహేష్, ప్రవీన్, చిన్న ఉన్నారు.

ఎమ్మెల్సీ మల్లన్నను కలిసిన కొమ్మూరి

చేర్యాల, జూన్ 10: ఎమ్మెల్సీ తీన్మార్ మల్లన్నను సోమవారం జనగామ డీసీసీ అధ్యక్షుడు కొమ్మూరి ప్రతాప్‌రెడ్డి హైదరాబాదులో మర్యాదపూర్వకంగా కలిశారు. పుష్పగుచ్ఛం అందించి, శాలువాకప్పి అభినందనలు తెలిపారు.

కార్పొరేట్ తరహాలో పేదలకు వైద్యం

● ఎమ్మెల్యే కొత్త ప్రభాకర్‌రెడ్డి

దుబ్బాక/మిరుదొడ్డి, జూన్ 10: దుబ్బాక ప్రభుత్వ ప్రాంతీయ ఆస్పత్రిలో కార్పొరేట్ తరహాలో పేదలకు వైద్యం అందించడం హర్షించ దగ్గవిషయమని దుబ్బాక ఎమ్మెల్యే కొత్త ప్రభాకర్‌రెడ్డి పేర్కొన్నారు. దుబ్బాకలోని స్థానిక ఆస్పత్రిలో సోమవారం అభివృద్ధి కమిటీ సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడారు. ఆస్పత్రికి సరిహద్దు జిల్లాల నుంచి రోగులు వైద్యం కోసం వస్తున్నారని, అలాంటివారికి ఆస్పత్రి సూపరింటెండెంట్ హేమరాజ్‌సింగ్ మెరుగైనా సేవలు అందిస్తున్నారని తెలిపారు. సమావేశంలో జిల్లా వైద్యాధికారి శ్రీనివాస్, మున్సిపల్ చైర్‌పర్సన్ వనితా, ఎంపీపీ పుష్పలత, జడ్పీటీసీ రవీందర్‌రెడ్డి, కౌన్సిలర్ లలితా, వైద్యసిబ్బంది తదితరులున్నారు. బీఆర్ఎస్ కార్యకర్తల కుటుంబాలకు పార్టీ ఎల్లవేళలా అండగా ఉంటుందని ఎమ్మెల్యే కొత్త ప్రభాకర్‌రెడ్డి తెలిపారు. సోమవారం దుబ్బాకలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో మిరుదొడ్డి పట్టణానికి చెందిన కాషా కళ్యాణ్‌కుమార్ కుటుంబానికి రెండు లక్షల ప్రమాదబీమా చెక్కును అందజేశారు.

ఆర్టీసీ డ్రైవర్‌పై చేయి చేసుకున్న కారు డ్రైవర్

● కేసు నమోదు చేసిన పోలీసులు

గజ్వేల్, జూన్ 10: ఆర్టీసీ డ్రైవర్‌పై కారు డ్రైవర్ చేయి చేసుకున్న సంఘటన గజ్వేల్ పట్టణంలో చోటుచేసుకుంది. గజ్వేల్-ప్రజ్ఞాపూర్ డిపోకు చెందిన టీజీ 36 జడ్ 0011 నెంబర్ గల బస్సు జూబ్లీ బస్‌స్టాండ్ నుంచి గజ్వేల్ బస్టాండ్‌కు వస్తున్న క్రమంలో గజ్వేల్ ప్రభుత్వాసుపత్రి వద్ద సిగ్నల్ పడడంతో డ్రైవర్ బస్సును నిలిపాడు. అదే క్రమంలో బస్సులోని కొందరు ప్రయాణికులు దిగుతుండడంతో డ్రైవర్ బస్సును నిలిపి ఉంచాడు. వెనకాల ఉన్న కారు డ్రైవర్ పలుమార్లు హారన్ మోగించాడు. ఈ క్రమంలో ఇద్దరి మధ్య వాగ్వాదం జరిగింది. అక్కడి నుంచి అంబేడ్కర్ చౌరస్తా వద్దకు బస్సు రాగానే కారు డ్రైవర్ బస్సు డ్రైవర్‌పై చేయి చేసుకున్నాడు. ఈ విషయమై బస్సు డ్రైవర్ బెల్లబోయిన మల్లేశం ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు గజ్వేల్ సీఐ బి.సైదా తెలిపారు.

ఉచిత వైద్య శిబిరాలను వినియోగించుకోవాలి

● పీఏసీఎస్ చైర్మన్ హరికృష్ణారెడ్డి

తొగుట, జూన్ 10: గ్రామాల్లో ఏర్పాటు చేస్తున్న ఉచిత వైద్య శిబిరాలను ప్రజలు వినియోగించుకోవాలని కాన్గల్ పీఏసీఎస్ చైర్మన్ హరికృష్ణారెడ్డి సూచించారు. సోమవారం మండలంలోని గుడికందుల గ్రామంలో హైదరాబాద్ ఆశ్రయం అండ్ హోప్ వారి ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఉచిత వైద్య శిబిరాన్ని ఆయన ప్రారంభించి మాట్లాడారు. వైద్య శిబిరానికి వచ్చిన వారికి రక్త పరీక్షలు, బీపీ, షుగర్, కంటి పరీక్షలు దంత పరీక్షలు, ఎక్స్‌రే ఈసీజీ పరీక్షలు నిర్వహించి వైద్యులు ఉచితంగా మందులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఆత్మ కమిటీ డైరెక్టర్ దూలం భైరగౌడ్, ఆశ్రయం అండ్ హోప్ సిబ్బంది, వైద్యులు, మాజీ సర్పంచ్ గంగనిగళ్ళ మల్లయ్య, గ్రామస్థులు పాల్గొన్నారు.

ఎమ్మెల్యే కవ్వంపల్లి జన్మదిన వేడుకలు



బెజ్జంకి మండల కేంద్రంలో కేక్‌ను కట్ చేస్తున్న నాయకులు

బెజ్జంకి, జూన్ 10: మానకొండూర్ ఎమ్మెల్యే కవ్వంపల్లి సత్యనారాయణ జన్మదిన వేడులకను సోమవారం మండల కేంద్రంలోని అంబేడ్కర్ కూడలిలో బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు ఒగ్గు దామోదర్, పార్టీ మండలాధ్యక్షుడు రత్నాకర్‌రెడ్డి ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా కేక్ కట్ చేసి ఎమ్మెల్యేకు శుభాకాంక్షలు తెలిపారు. ఆయా గ్రామాలకు చెందిన కార్యకర్తలు విద్యార్థులకు నోట్ బుక్‌లు, పెన్నులు, పెన్సిల్లు పంపిణీ చేశారు.

ఇసుక అక్రమ రవాణా చేస్తున్న ట్రాక్టర్ల పట్టివేత

సిద్దిపేట అర్బన్/చిన్నకోడూరు, జూన్ 10: అక్రమంగా ఇసుక తరలిస్తున్న రెండు ట్రాక్టర్లను సిద్దిపేట టాస్క్‌ఫోర్స్, త్రీటౌన్ పోలీసులు సోమవారం స్వాధీనం చేసుకున్నారు. నంగునూరు నుంచి సిద్దిపేటకు వస్తున్న రెండు ఇసుక ట్రాక్టర్లను సిద్దిపేట అర్బన్ మండలం మిట్టపల్లి సమీపంలో పట్టుకుని, నంగునూరు మండలం అక్కెనపల్లికి చెందిన భైరి నరేష్, సాయిలను అదుపులోకి తీసుకుని విచారించగా, ఎటువంటి అనుమతులు లేకుండా ఇసుక తరలిస్తున్నారని నిర్ధారణ కావడంతో వాటిని సీజ్ చేసినట్లు త్రీటౌన్ సీఐ విద్యాసాగర్ తెలిపారు. చిన్నకోడూరు మండలంలోని చెర్లఅంకిరెడ్డిపల్లి శివారులో ఎక్స్‌కవేటర్ సహాయంతో ట్రాక్టర్‌ల ద్వారా అక్రమంగా మట్టిని తరలిస్తున్నారన్న సమాచారంతో సిద్దిపేట టాస్క్‌ఫోర్స్ పోలీసులు అక్కడికి చేరుకుని ఆరు ట్రాక్టర్‌లతో పాటు, ఒక ఎక్స్‌కవేటర్‌ను స్వాధీనం చేసుకోని చిన్నకోడూరు పోలీసులకు అప్పగించారు. విచారణ చేపట్టి చర్యలు తీసుకుంటామని ఎస్‌ఐ బాలకృష్ణ తెలిపారు.



మండలంలోని మల్లంపల్లి ప్రభుత్వ ఉన్నత పాఠశాల 2001-02 సంవత్సరంలో పదో తరగతి చదివిన విద్యార్థులు 22 సంవత్సరాల తర్వాత సోమవారం ఆత్మీయ సమ్మేళనం జరుపుకున్నారు. ఈ సందర్భంగా ఆ నాటి జ్ఞాపకాలను గుర్తుచేసుకుని ఆట-పాటలతో ఉత్సాహంగా గడిపారు. అనంతరం తమకు విద్యాబుద్ధులు నేర్పిన ఉపాధ్యాయులను ఘనంగా సన్మానించారు.

- అక్కన్నపేట

రెండేళ్లు గడుస్తున్నా అసంపూర్తిగానే..

● మనఊరు మనబడికి రూ. 5.41 కోట్లు

● నత్తనడకన పనులు



రేబర్తిలో నత్తనడకన పాఠశాల నిర్మాణ పనులు



రేబర్తిలో అసంపూర్తి వంట గది నిర్మాణం

మద్దూరు, జూన్ 10: ప్రైవేటు పాఠశాలలకు దీటుగా ప్రభుత్వ పాఠశాలల బలోపేతానికి గత ప్రభుత్వం 'మనఊరు మనబడి' కార్యక్రమాన్ని ప్రారంభించింది. కానీ దీని ద్వారా మౌలిక వసతుల కల్పనకు మంజూరైన పనులు రెండేళ్లైనా అసంపూర్తిగానే దర్శనిమిస్తున్నాయి. ఈ ఏడాది విద్యాసంవత్సరానికైనా పనులు పూర్తయ్యేన అని ఎదురు చూసిన విద్యార్థులకు, ఉపాధ్యాయులకు నిరాశే మిగిలింది. కాంట్రాక్టర్ చేపట్టిన పనులకు బిల్లులు మంజూరు కాకపోవడంతోనే పనులు సాగడం లేదని తెలుస్తున్నది.

మనఊరు మనబడికి రూ. 5.41 కోట్లు

మన ఊరు మనబడి కింద ఎంపికైన మద్దూరు, దూళిమిట్ట మండలాల్లోని 8 పాఠశాలలకు సుమారు రూ. 5.41 కోట్ల నిధులు మంజూరయ్యాయి. మద్దూరు మండలంలోని పాథమిక పాఠశాలకు రూ.58.4 లక్షలు, ఉన్నత పాఠశాలకు రూ.54.31 లక్షలు, రేబర్తి ప్రాథమిక పాఠశాలకు రూ.18.27 లక్షలు, ఉన్నత పాఠశాలకు 37.59 లక్షలు, సలాఖ్‌పూర్ పాథమిక పాఠశాకు రూ.20.79 లక్షలు, ఉన్నత పాఠశాలకు రూ.73.55లక్షలు, గాగిళ్లాపూర్ ప్రాథమిక పాఠశాలకు రూ.25.86 లక్షలు, యూపీఎస్ వల్లంపట్లకు రూ. 37.09 లక్షలు, దూళిమిట్ట మండలంలోని భైరాన్‌పల్లి ప్రాథమిక పాఠశాలకు రూ.29.23 లక్షలు, ఉన్నత పాఠశాలకు రూ.34.84 లక్షలు, దూళిమిట్ట ప్రాథమిక పాఠశాలకు రూ. 28.14 లక్షలు, ఉన్నత పాఠశాలకు రూ.57.12 లక్షలు, తోర్నాల ప్రాథమిక పాఠశాలకు రూ.65.65 లక్షల నిధులు మంజూరయ్యాయి.

హడావిడిగా పనులకు శ్రీకారం

మనఊరు-మనబడి కింద పాఠశాలల బలోపేతానికి మంజూరైన పనులకు టెండరు దక్కించుకున్న కాంట్రాక్టర్లు హడావిడిగా పనులకు శ్రీకారం చుట్టారు. మొదట్లో వారు పనులను నాణ్యత లేనితో చేపట్టినట్లు ఉపాధ్యాయులు, ప్రజా ప్రతినిధుల నుంచి ఆరోపణలు వెల్లువెత్తాయి. రెండేళ్ల కావొస్తున్నా పనులు అసంపూర్తిగా పనులు వెక్కిరిస్తున్నాయి. రేబర్తిలో నత్తనడకన సాగుతుండగా సలాఖ్‌పూర్, మద్దూరు, తోర్నాల, గాగిళ్లాపూర్, వల్లంపట్ల దూళిమిట్ట గ్రామాల్లో అసంపూర్తిగా పనులు మిగిలిపోయాయి.

చర్యలు తీసుకుంటున్నాం



పలు పాఠశాలల్లో పనులు చివరి దశల్లో ఉన్నందున త్వరగా పూర్తి చేయించడానికి చర్యలు తీసుకుంటున్నాం. అమ్మ ఆదర్శ పాఠశాల కమిటీల ద్వారా పాఠశాలల్లో మౌలిక వసతులకు మంజూరైన పనుల ద్వారా అసంపూర్తి పనుల పూర్తికి చర్యలు చేపడుతున్నాం.

-వినయ్‌రెడ్డి పీఆర్ ఏఈ మద్దూరు